Follow: @ANNTELUGU
ANN తెలుగు
11-09-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 233 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రాష్ట్ర ఆర్థిక వృద్ధికి జిల్లాలే చోదక శక్తులు

- అవకాశాలను అన్ లాక్ చేస్తేనే జీఎస్డీపీ లక్ష్యం సాధ్యం
- పెట్టుబడుల్ని ఆకర్షించేలా అక్టోబరులో ప్రాంతీయ సదస్సులు
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2026–27 వృద్ధిరేటు అంచనా 13.44 శాతంగా నమోదైందన్న అధికారులు

అమరావతి, సెప్టెంబర్ 10 :మహా : జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకునేలా జిల్లాల్లో ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయాలని, స్థానిక వనరులను సమర్థంగా మార్కెటింగ్ చేసుకుని సంపద సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల వారీగా వృద్ధి సమాచారాన్ని మంత్రులు, కలెక్టర్లకు అందించేలా ఆర్టీజీఎస్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెట్టుబడుల గ్రౌండింగ్, జీఎస్డీపీ సహా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ధరల సూచీ మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్



### తిరుమల శ్రీవారి హుండీకి కానుకల వెల్లువ

- ఒక్కరోజులో రూ.5.59 కోట్ల ఆదాయం
- భక్తుల రద్దీతో కొత్త రికార్డు.

03

### 'దవడ' దుమారం!



- అవును.. నా దవడ విరిగింది.
- విజయ్‌కు స్టాలిన్ స్ట్రాంగ్ కౌంటర్.
- అసెంబ్లీని సినిమా షూటింగ్ స్పాట్‌గా మార్చొద్దు.

03

### 37 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థి సంఘాల ఎన్నికలు.

- కర్ణాటక ప్రభుత్వ కీలక నిర్ణయం
- క్యాంపస్‌లలో ప్రజాస్వామ్యానికి కొత్త ఊపిరి.
- రాజకీయ పార్టీలకు నో ఎంట్రీ.



03

# బీఆర్ఎస్ గ్రాఫ్ డౌన్



మూడు రోజుల అసెంబ్లీ పై ఫ్లాష్ సర్వే
ధరణి భూముల చిట్టా సిద్ధం
22ఏపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడదాం.
సీఎం రేవంత్‌రెడ్డి.




**హైదరాబాద్, మహా :** మూడు రోజుల అసెంబ్లీ సమావేశాలతో తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, విప్‌లు సమర్థంగా పనిచేశారని, సభలో జరిగిన పరిణామాలపై నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ గణనీయంగా పడిపోయిందని సీఎల్పీ సమావేశంలో సీఎం వెల్లడించారు. ప్రతిపక్షం చేస్తున్న రాజకీయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ శాసనసభాపక్షం సమష్టిగా ముందుకు సాగాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

మూడు రోజుల అసెంబ్లీ సమావేశాలను రాజకీయంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా మలచడంలో మంత్రులు, విప్‌లు, ఎమ్మెల్యేలు కీలకంగా వ్యవహరించారని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ప్రభుత్వంపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలకు సభలోనే సమర్థవంతమైన సమాధానాలు ఇవ్వడంతో పాటు, ప్రజా సమస్యలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలకు వివరించడంలో ఎమ్మెల్యేల పనితీరు బాగుందని ఆయన పేర్కొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ అనుసరించిన వైఖరిపై కూడా సీఎం తీవ్రంగా స్పందించారు. ప్రజా సమస్యలపై చర్చకు వేదికగా ఉండాల్సిన శాసనసభను రాజకీయ ఆందోళనలకు వేదికగా మార్చడం ద్వారా ప్రతిపక్షం తనకే నష్టం చేసుకుందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సభలో ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షం బాధ్యతేనని, అయితే సభా కార్యక్రమాలను సజావుగా సాగనివ్వకుండా అడ్డుకోవడం ద్వారా ప్రజల ముందు ఎవరి వైఖరి ఎలా ఉందో స్పష్టమైందని ఆయన పేర్కొన్నారు.

ఇక 22ఏ భూముల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యంత మిగతా 3వ పేజీలో



# బేరం కుదిరిందా ...?

### భ్రష్టు పట్టిన ఘట్కేసర్ సర్కిల్...!

- జోడిమెట్లలో ఆగని అక్రమ షెడ్ నిర్మాణం...!
- నేరుగా ఫిర్యాదులు చేసినా పట్టించుకోని డిప్యూటీ కమిషనర్ ...!
- ఎన్ని వార్తలు వచ్చినా 'డోంట్ కేర్'...!
- హైవే పక్కనే యథేచ్ఛగా నిర్మాణ పనులు...!
- 20 రోజులుగా నిలిచిన షెడ్ నిర్మాణం.. బేరం కుదరగానే మళ్లీ నిర్మాణ పనులు చేస్తున్న అక్రమార్కులు..!
- డమ్మీగా మారిన టౌన్ ప్లానింగ్ విభాగం...!
- అక్రమ నిర్మాణాలకు కొమ్ముగాస్తున్న ఆ షాడో అధికారి ఎవరు...?
- స్పెషల్ టాస్క్ ఫోర్స్ రంగంలోకి దిగాల్సిందే...!
- జోనల్ కమిషనర్ స్పందించాలంటున్నా స్థానికులు...!

02

**మహా, సిటీ బ్యూరో:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్, పోచారం డివిజన్, జోడిమెట్ల వద్ద హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన 'తాజా కిచెన్' ఎదురుగా నిర్మిస్తున్న అక్రమ షెడ్ నిర్మాణ పనులు 20 రోజుల విరామం తర్వాత మళ్లీ ప్రారంభం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. అక్రమంగా నిర్మిస్తున్న షెడ్ నిర్వాహకులతో బేరం కుదిరిందనుకుంటా.. అందుకే నిర్మాణ పనులు మళ్లీ మొదలయ్యాయంటూ స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కొద్దిరోజులుగా నిలిచిపోయిన నిర్మాణ పనులు ఒక్కసారిగా తిరిగి ప్రారంభం కావడం వెనుక కారణాలేమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై స్థానికంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల గురించి స్థానికులు ఉన్నతాధికారులకు మిగతా 2వ పేజీలో




### ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు సర్వం సిద్ధం

- ప్రపంచ నేతల రాకతో హైఅలర్ట్.
- సెప్టెంబర్ 12, 13న 18వ బ్రిక్స్ సదస్సు.
- 35కి పైగా రహదారులపై ఆంక్షలు.
- 22 ప్రాంతాల్లో దారి మళ్లింపులు.
- 11 నుంచి 13 వరకు ఢిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలు.

**న్యూఢిల్లీ,మహా :** ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని ఢిల్లీ ముస్తాబైంది. భారత అధ్యక్షతన సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సదస్సు జరగనుంది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టిన నేపథ్యంలో నిర్వహిస్తున్న మిగతా 2వ పేజీలో

### ఫామ్‌హౌస్‌లో ప్రముఖ రియల్టర్ బలవన్మరణం.

- ఆర్థిక ఒత్తిళ్లే కారణమా?.. సూసైడ్ నోట్ స్వాధీనం.
- 250 ఎకరాల భూ ప్రాజెక్టు వివాదం.. అప్పుల భారంతో తీవ్ర మనోవేదన?

02





### 22Aపై చర్చకు బీఆర్ఎస్ పట్టు

- అసెంబ్లీ, మండలిలో హైడ్రామా.
- మహిళా ఎమ్మెల్యేలపై దాడి నుంచి సాగునీటి వరకు.. ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు.

**హైదరాబాద్, మహా :** మా మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగింది.. మాపై దాడి చేసి మాపైనే కేసులు పెట్టారు. 22A, ఫీరీయింబర్స్‌మెంట్ పై చర్చ జరగకుండా ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు'' అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరిగినా వారికి సభలో మాట్లాడే అవకాశం మిగతా 2వ పేజీలో

### చేదు జ్ఞాపకానికి 25 ఏళ్లు

అమెరికా గుండెల్లో ఇంకా మారని '9/11' గాయం!

04







### ఆర్టీసీలో త్వరలో గుర్తింపు సంఘాల ఎన్నికలు

'ఎన్నికల తర్వాతే ఆర్టీసీ విలీనంపై నిర్ణయం.

- హైదరాబాద్‌కు 2,200 ఎలక్ట్రిక్ బస్సులు.
- రిటైర్డ్ కార్మికులకు రూ.1,152 కోట్ల బకాయిలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

02

# బేరం కుదిరిందా ...?

( మొదటి పేజీ తరువాయి )
నేరుగా ఫిర్యాదులు చేసినా, పత్రికల్లో వరుసగా వార్త కథనాలు వచ్చినా ఇక్కడి అధికారులు మాత్రం 'డోంట్ కేర్' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే నిర్మాణ పనులు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొంటున్నారు.



### హైవే పక్కనే యథేచ్ఛగా నిర్మాణ పనులు..!

జాతీయ రహదారి పక్కనే నిర్మాణ పనులు కొనసాగుతున్నా వాటిని అడ్డుకునే చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ షెడ్డు నిర్మాణం జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాధారణ ప్రజలు చిన్న నిర్మాణం చేపట్టాలన్నా అనుమతులు, నిబంధనల పేరుతో అనేక ఆంక్షలు విధించే అధికారులు.. బహిరంగంగా జరుగుతున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### దమ్మీగా మారిన టౌన్ ప్లానింగ్ విభాగం..!

ఘట్కేసర్ సర్కిల్ లో అక్రమ నిర్మాణాలను గుర్తించి నిలిపివేయాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం దమ్మీగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమవడంతో భారీగా ముడుపులు ముట్టయనే అనుమానాలు స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి. 20 రోజులపాటు నిలిచిన నిర్మాణ పనులు మళ్లీ మొదలవడంతో అధికారుల ఉదాసీనతకు అసలు కారణమేంటన్న చర్చ స్థానికంగా జోరుగా కొనసాగుతోంది.

### అక్రమార్కులకు కొమ్ముగాస్తున్న షాడో అధికారి ఎవరు..?

సర్కిల్ లో ఇన్ని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడానికి కారణం కార్యాలయంలో చక్రం తిప్పుతున్న ఓ 'షాడో అధికారి' అని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి లక్షలాది రూపాయలు రాజకీయ నాయకులకు ముట్టజెప్పి అడ్డదారిలో పోస్టింగ్ తెచ్చుకున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. తాను చెల్లించిన సొమ్మును తిరిగి రాబట్టుకునేందుకు అక్రమ నిర్మాణదారులను అడ్డుపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నట్లు స్థానికులు బహిరంగంగానే పేర్కొంటున్నారు.
అక్రమార్కులకు కొమ్ముగాస్తూ తెరవెనుక ఉండి అన్ని వ్యవహారాలను చక్కబెడుతూ, వసూళ్ల పర్వాన్ని పర్యవేక్షిస్తున్న ఆ 'షాడో అధికారి' ఎవరనే చర్చ ఇప్పుడు ఘట్కేసర్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, పత్రికల్లో వార్త కథనాలు వచ్చినా చర్యలు కనిపించకపోవడం వెనుక సదరు అధికారి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఉన్నతాధికారులు నిఘా పెట్టి సమగ్ర విచారణ జరిపితే అసలు వ్యవహారం, వసూళ్ల వెనుక ఉన్న వ్యక్తుల గుట్టు రట్టయ్యే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

### ఏసీబీ స్కెచ్ వేస్తే భారీ తిమింగలమే వలలో చిక్కుతోంది...!

లక్షలాది రూపాయలు రాజకీయ నాయకులకు ముట్టజెప్పి అడ్డదారిలో పోస్టింగ్ తెచ్చుకున్న సదరు షాడో అధికారి.. తాను చెల్లించిన సొమ్మును తిరిగి రాబట్టుకునేందుకు అక్రమార్కులను అడ్డుపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై ఏసీబీ పక్కా స్కెచ్‌తో నిఘా పెడితే.. తెరవెనుక చక్రం తిప్పుతున్న ఆ షాడో అధికారి వ్యవహారాలన్నీ వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

### స్పెషల్ టాస్క్ ఫోర్స్ రంగంలోకి దిగాల్సిందే..!

స్థానిక అధికారుల తీరుపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపారనే ఆరోపణల నేపథ్యంలో, ఇక్కడ న్యాయం జరుగుతుందనే నమ్మకం పూర్తిగా లేకుండా పోయిందని వారు తీవ్ర ఆవేదన


ఘట్కేసర్ సర్కిల్‌లో
ఆగని అక్రమ నిర్మాణాలు...!

వ్యక్తం చేస్తున్నారు. అందుకే స్థానిక యంత్రాంగంపై ఆధారపడకుండా వెంటనే స్పెషల్ టాస్క్ ఫోర్స్ లాంటి ఉన్నత స్థాయి విభాగాలు రంగంలోకి దిగాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అక్రమ షెడ్ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, అవసరమైన నిబంధనల మేరకు కూల్చివేత చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు వెలికి తీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని వారు కోరుతున్నారు.

### జోనల్ కమిషనర్ స్పందించాలంటున్న స్థానికులు..!

ఘట్కేసర్ సర్కిల్‌లో జరుగుతున్న అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై, అడ్డుఅదుపు లేకుండా కొనసాగుతున్న అక్రమ షెడ్లపై జోనల్ కమిషనర్ తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కింది స్థాయి అధికారుల నివేదికలపై ఆధారపడకుండా స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ అక్రమ షెడ్ నిర్మాణాన్ని ఉన్నతాధికారులు తక్షణమే పరిశీలించి, కూల్చివేసి అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.




# ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు సర్వం సిద్ధం

( మొదటి పేజీ తరువాయి )
ఈ శిఖరాగ్ర సమావేశానికి సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాల ప్రతినిధులు, ్రపంచ నేతలు హాజరుకానున్నారు.
భారత్ 2026 బ్రిక్స్ అధ్యక్షతకు 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత' అనే ఇతివృత్తాన్ని ఎంచుకుంది. స్థితిస్థాపకతను పెంపొందించడం, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం, సభ్య దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, సుస్థిర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం ఈ ఇతివృత్తం ప్రధాన లక్ష్యంగా ఉంది.ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, ఆహార భద్రత, సాంకేతిక సహకారం, బహుపాక్షిక వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై బ్రిక్స్ దేశాల నేతలు చర్చించే అవకాశం ఉంది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరా మార్గాలపై వాటి ప్రభావం వంటి పరిణామాలు కూడా చర్చల్లో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది.
సదస్సు నేపథ్యంలో ఢిల్లీ నగరంలో భద్రతను భారీగా కట్టుదిట్టం చేశారు. వివిధ భద్రతా సంస్థల సమన్వయంతో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. విదేశీ ప్రతినిధులు, దేశాధినేతల రాకపోకలకు ప్రత్యేక మార్గాలను సిద్ధం చేశారు. భారత్ మండపం, ప్రముఖ హోటళ్లు, విమానాశ్రయం, రైల్వే స్టేషన్ల పరిసరాల్లో భద్రతా తనిఖీలు ముమ్మరం చేశారు.
ఇక సదస్సు కారణంగా ఢిల్లీ వాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు ప్రత్యేక ట్రాఫిక్ సూచనలు జారీ చేశారు. 35కి పైగా ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలను నియంత్రించడంతో పాటు 22 దారి మళ్లింపు ప్రాంతాలను ఏర్పాటు చేశారు. విదేశీ ప్రతినిధులు, అత్యంత ముఖ్యమైన అతిథుల వాహన శ్రేణుల రాకపోకల సమయంలో అవసరాన్ని బట్టి ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం, ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించడం వంటి చర్యలు చేపట్టనున్నారు.
సర్దార్ పటేల్ మార్గ్, మదర్ థెరిసా క్రెసెంట్, టీన్‌మూర్తి మార్గ్, అక్బర్ రోడ్, మథురా రోడ్, జనపథ్, అశోకా రోడ్, బరాఖంబా రోడ్, టాల్‌స్టాయ్ మార్గ్, నీతి మార్గ్, పంచశీల్ మార్గ్, ఏపీజే అబ్దుల్ కలాం రోడ్ తదితర కీలక రహదారులు ట్రాఫిక్ నియంత్రణ పరిధిలోకి రానున్నాయి.
విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు, రైల్వే స్టేషన్లకు వెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా న్యూఢిల్లీ, పాత ఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లు, ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గాల్లో అత్యంత ముఖ్యమైన అతిథుల రాకపోకల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ ఉండే అవకాశం ఉంది. ప్రయాణికులు సాధ్యమైనంత వరకు మెట్రో వంటి ప్రజా రవాణా మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.
సదస్సు నేపథ్యంలో ఇప్పటికే వాహన శ్రేణుల రాకపోకల సాధన నిర్వహిస్తూ ట్రాఫిక్ నిర్వహణను అధికారులు పరీక్షిస్తున్నారు. అత్యంత ముఖ్యమైన అతిథుల వాహన శ్రేణుల రాకపోకలకు అంతరాయం లేకుండా చేయడంతో పాటు సాధారణ ప్రజలకు సాధ్యమైనంత తక్కువ ఇబ్బంది కలిగేలా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేస్తున్నారు.
ఈ ఏడాది బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత వహిస్తుండటంతో న్యూఢిల్లీ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రపంచ దక్షిణ దేశాల సహకారం, సాంకేతిక అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో భారత్ తన అధ్యక్షతను ముందుకు తీసుకెళ్తోంది. సదస్సు ముగింపులో కీలక అంశాలపై ఉమ్మడి నిర్ణయాలు, న్యూఢిల్లీ ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



# ఫామ్‌హౌస్‌లో ప్రముఖ రియల్టర్ బలవన్మరణం.

**రంగారెడ్డి, మహా: ప్రముఖ రియల్టర్ బనాల రామ్‌రెడ్డి** ఫామ్‌హౌస్‌లో బలవన్మరణానికి పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లాలో విషాదం నింపింది. కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెదునూరు గ్రామంలో ఉన్న ఆయన ఫామ్‌హౌస్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా సూసైడ్ నోట్ లభించినట్లు తెలిపారు. ప్రాథమికంగా ఆర్థిక ఒత్తిళ్ల కారణంగానే ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.
హైదరాబాద్ మణికొండలో నివాసం ఉంటున్న రామ్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. 2018లో పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 250 ఎకరాల భూమిని డెవలప్‌మెంట్ కోసం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఆ భూమికి సంబంధించి వివాదాలు, కోర్టు కేసులు తలెత్తడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించిన క్రమంలో ఆయన భారీగా అప్పులు చేసినట్లు తెలుస్తోంది.
ఒకవైపు భూ యజమానులతో తలెత్తిన సమస్యలు, మరోవైపు అప్పుల ఒత్తిళ్లు కొనసాగడంతో రామ్‌రెడ్డి తీవ్ర మనోవేదనకు గురైనట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే ఆత్మహత్యకు అసలు కారణాలు ఏమిటన్నది దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో లభించిన సూసైడ్ నోట్‌లోని వివరాలను కూడా పరిశీలిస్తున్నారు.
రామ్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది. సూసైడ్ నోట్ వివరాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, అప్పుల వ్యవహారాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# హైదరాబాద్ శివార్లకు మహర్దశ

**హైదరాబాద్, మహా:** నగర విస్తరణకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రేడియల్ రోడ్డు-2 నిర్మాణానికి హెచ్‌ఎండీఏ టెండర్లు ఆహ్వానించింది. ఓఆర్ఆర్‌లోని బుద్వేల్ నుంచి పారిశ్రామిక ప్రాంతాల మీదుగా నాచారం సమీపంలోని జాతీయ రహదారి-167 వరకు 81.15 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.5,060 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. టెండర్లకు ఈ నెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.రేడియల్ రోడ్డు-2ను మూడు ప్యాకేజీలుగా నిర్మించనున్నారు. మొదటి ప్యాకేజీలో బుద్వేల్ నుంచి షాబాద్ వరకు 29.50 కిలోమీటర్లు, రెండో ప్యాకేజీలో షాబాద్ నుంచి గూడూరు వరకు 27 కిలోమీటర్లు, మూడో ప్యాకేజీలో గూడూరు నుంచి నాచారం వరకు 24.65 కిలోమీటర్ల రహదారి నిర్మించనున్నారు. ఈ మార్గం రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లోని పలు ప్రాంతాలను అనుసంధానించనుంది.
ప్రాజెక్టుకు 41 గ్రామాల్లో 1,486.30 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 831.36 ఎకరాలు, వికారాబాద్‌లో 558.18 ఎకరాలు, నారాయణపేటలో 96.16 ఎకరాలు ఉన్నాయి. ఇప్పటివరకు సుమారు 902.16 ఎకరాల భూసేకరణ పూర్తయినట్లు సమాచారం. భూసేకరణ, టెండర్ల ప్రక్రియలను సమాంతరంగా కొనసాగిస్తూ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.రేడియల్ రోడ్డు-2 అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాల్లోని పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు భారీ ప్రయోజనం కలగనుంది. సరుకు రవాణా వాహనాలు నగరంలోని రద్దీ ప్రాంతాల్లోకి రాకుండానే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుంది. దీంతో ప్రయాణ సమయం, రవాణా వ్యయం తగ్గే అవకాశం ఉంది. లాజిస్టిక్స్ కేంద్రాలు, గిడ్డంగులు, పరిశ్రమలు, నివాస ప్రాంతాల అభివృద్ధికి ఈ రహదారి దోహదపడనుంది.

# 22Aపై చర్చకు బీఆర్ఎస్ పట్టు

( మొదటి పేజీ తరువాయి )
ఇవ్వలేదని ఆయన విమర్శించారు. కావాలనే మహిళా పోలీసులను ముందు వరుసలో పెట్టి తమ ఆందోళనను అడ్డుకున్నారని ఆరోపించారు.
ఈ నేపథ్యంలో గురువారం తెలంగాణ శాసనమండలిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 22A అంశంపై చర్చ జరపాలని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. వాయిదా తీర్మానాలను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తిరస్కరించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోడియం వైపు దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ప్లకార్డులు తొలగించాలని మార్షల్స్‌ను ఛైర్మన్ ఆదేశించారు. ఈ క్రమంలో కొందరు బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్ద పేపర్లు చించి పైకి ఎగురవేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. సభ్యుల తీరుపై ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్ఎస్ సభ్యులు మండలి నుంచి వాకౌట్ చేశారు.
22A భూముల అంశంపై ప్రభుత్వం సమగ్ర చర్చకు సిద్ధంగా ఉందని చెబుతున్నప్పటికీ, తమకు చర్చకు అవకాశం ఇవ్వకుండా తప్పించుకుంటోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. భూముల సమస్యతో పాటు విద్యార్థులకు సంబంధించిన ఫీరీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావించాలని ఆ పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ రెండు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే తమ ఆందోళన అని హరీశ్‌రావు పేర్కొన్నారు.
ఇదే సమయంలో తుక్కుగూడలోని టెస్సెరాక్ట్ ప్రాంతానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం వెళ్లింది. ప్రభుత్వం కొండల్‌రెడ్డికి కేటాయించినట్లు పేర్కొంటున్న భూములను కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ''పేదవారిని కొట్టాలి.. పెద్దవాళ్లకు పెట్టాలి అన్నట్లుగా రాష్ట్రంలో పరిస్థితి ఉంది'' అని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు.



ముఖ్యమంత్రి భూ దోపిడీపై ప్రశ్నిస్తే తమను సభ నుంచి సస్పెండ్ చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి సంబంధించిన కంపెనీకి పటాన్‌చెరులో భూములు ఇచ్చారంటూ ఆయన ఆరోపణలు చేశారు. చిన్న కంపెనీకి ఇక్కడ భూములు కేటాయించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వం నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.
మరోవైపు సాగునీటి అంశాన్ని హరీశ్‌రావు ప్రధానంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ప్రతి చుక్క నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో పంట పొలాలు ఎండిపోతున్న సమయంలో కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు వదులుతున్నారని ఆయన ఆరోపించారు. ''రేవంత్‌రెడ్డి వస్తారా? ఉత్తమ్ వస్తారా? కల్వకుర్తిలో మూడు మోటార్లు ఎందుకు బంద్ పెట్టారు?'' అంటూ సవాల్ విసిరారు.
కళ్లముందే నీళ్లు పారుతున్నా తెలంగాణ రైతులకు సాగునీరు అందించలేని పాలన కొనసాగుతోందని హరీశ్‌రావు విమర్శించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, రేవంత్‌రెడ్డి పాలన తెచ్చిన కరువు అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో నీళ్లు ఫుల్‌గా ఉంటే తెలంగాణలో నీళ్లు నిల్‌గా ఉన్నాయని ఆరోపించారు. ''చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా?'' అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాల రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై సభలో జరిగిన పరిణామాలపైనా బీఆర్ఎస్ నేతలు స్పందించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ తాతా మధు కొంతకాలం ఆసుపత్రిలో ఉండి వచ్చారని, తన ప్యాంట్‌ను ఎవరో లాగుతున్నారన్న ఆవేదనతోనే ఆ వ్యాఖ్యలు చేశారని అన్నారు. ఆ ఘటన అసెంబ్లీ బయట జరిగిందని, దానికి అసెంబ్లీతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు.
''స్పీకర్‌కు కులాలు ఉండవు'' అని తలసాని వ్యాఖ్యానించారు. స్పీకర్‌ను దళిత స్పీకర్ అంటూ కాంగ్రెస్ నేతలు పదేపదే ప్రస్తావించడం అవమానించడమేనని ఆరోపించారు. ప్రసాద్‌కుమార్‌పై అంత ప్రేమ ఉంటే ఆయన్నే ముఖ్యమంత్రిని చేయాలని, తాము కూడా మద్దతు ఇస్తామని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.
మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1 కోటి బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం ఈ బీమాను అమలు చేస్తోందని తెలిపారు. మొత్తం 12,91,056 మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఈ పథకం పరిధిలోకి వస్తారని, ఇందులో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 5,00,158 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బంది, 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని వివరించారు. దేశంలోనే తొలిసారిగా ఇలాంటి విధానాన్ని అమలు చేస్తున్నామని భట్టి పేర్కొన్నారు.
ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మరో వివాదాన్ని తెరపైకి తెచ్చారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నకిలీ అకౌంట్లకు సంబంధించిన పోస్టులను చూపించారని ఆరోపిస్తూ సస్పెండ్ కాని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు లేఖ రాశారు. సభా హక్కుల ఉల్లంఘన కింద ముఖ్యమంత్రికి నోటీసు ఇచ్చినట్లు ఆ లేఖలో పేర్కొన్నారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.
ఇదిలా ఉండగా మూడు రోజులుగా అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి CLP సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ''3 రోజుల అసెంబ్లీ ఎపిసోడ్‌పై ఫ్లాష్ సర్వే చేయించా.. బీఆర్ఎస్ గ్రాఫ్ చాలా పడిపోయింది'' అని ఆయన వ్యాఖ్యానించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మంత్రులు, విప్‌లు, ఎమ్మెల్యేలు సమర్థంగా పనిచేశారని సీఎం అభినందించినట్లు తెలిపాయి. 22A భూముల అంశంపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హరీశ్‌రావు ధరణిలో రాయించుకున్న భూముల వివరాల చిట్టా బయటపెడతామని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన భూముల వివరాలన్నీ తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే వాటిని ప్రజల ముందు ఉంచుతామని సీఎం వ్యాఖ్యానించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.దీంతో 22A భూముల వివాదం, సాగునీటి అంశం, ఫీరీయింబర్స్‌మెంట్ బకాయిలు, మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఆరోపణలు, ధరణి భూముల వ్యవహారం చుట్టూ తెలంగాణ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒకవైపు ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీస్తున్నామని బీఆర్ఎస్ చెబుతుండగా, మరోవైపు ప్రతిపక్షం కావాలనే అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకుంటోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. తాజా పరిణామాలతో అసెంబ్లీ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరు మరింత ముదిరింది.

## ప్రేమ పెళ్లి చేసుకున్నాడని యువకుడి ఇంటిని కూల్చివేత!

**గద్వాల,మహా:** ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్న ఆగ్రహంతో ఓ యువకుడి ఇంటిని జేసీబీలతో కూల్చివేసిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో తీవ్ర సంచలనం రేపింది. వేరే కులానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడనే కారణంతో యువతి కుటుంబ సభ్యులు, వారి అనుచరులు ఆగ్రహానికి గురై పథకం ప్రకారం జేసీబీలను తీసుకొచ్చి యువకుడికి చెందిన ఇంటిని కూల్చివేసినట్లు బాధితుడు ఆరోపించాడు. యువకుడు, యువతి ప్రేమించుకుని వివాహం చేసుకున్న విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వివాదం మొదలైనట్లు సమాచారం. ఈ క్రమంలో యువకుడి ఇంటిపై ఆగ్రహంతో దాడికి దిగిన కొందరు జేసీబీలను అక్కడికి తీసుకొచ్చి ఇంటిని కూల్చివేశారు. చూస్తుండగానే ఇల్లు నేలమట్టం కావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు వెలుగులోకి రావడంతో విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఇంటిని కూల్చివేయడమే కాకుండా తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని బాధిత యువకుడు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ప్రేమ వివాహం చేసుకున్నందుకే తన ఇంటిని అక్రమంగా కూల్చివేశారని, తనకు న్యాయం చేయడంతో పాటు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నాడు. కులం పేరుతో తనపై, తన కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అక్కడ భద్రతను ఏర్పాటు చేసినట్లు సమాచారం.



# బీఆర్ఎస్ గ్రాఫ్ డౌన్

(మొదటి పేజీ తరువాయి )

ఘాటుగా స్పందించారు. 22ఏ పేరుతో ప్రతిపక్షం చేస్తున్న ప్రచారానికి వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. భూముల అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సహించదని, అవసరమైన అన్ని వివరాలను ప్రజల ముందుంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు.ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావును ఉద్దేశించి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రకంపనలు సృష్టించాయి. "హరీశ్‌రావు.. ధరణిలో రాయించుకున్న భూముల చిట్టా బయటపెడదాం. బీఆర్ఎస్ నేతల చిట్టా అంతా సిద్ధంగా ఉంది" అంటూ సీఎం స్పష్టమైన హెచ్చరిక చేశారు. దీంతో 22ఏ భూముల అంశం ఒక్కసారిగా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య ప్రధాన రాజకీయ పోరుగా మారింది.ధరణి రికార్డులు, భూముల లావాదేవీలు, 22ఏ జాబితా వంటి అంశాలు ఇకపై రాజకీయ ఆరోపణలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల ముందుకు వచ్చే వాస్తవాల ఆధారంగా చర్చకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వద్ద ఉన్న భూముల వివరాలను బయటపెడతామని సీఎం ప్రకటించడంతో బీఆర్ఎస్ నేతల భూముల వ్యవహారం రాజకీయంగా కీలక అంశంగా మారింది.అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తీవ్ర రాజకీయ పోరు కొనసాగింది. నిరసనలు, నినాదాలు, సభలో వాగ్వాదాలు, సభ్యుల సస్పెన్షన్ వంటి పరిణామాలు వరుసగా చోటుచేసుకున్నాయి. ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తే, అధికార కాంగ్రెస్ అదే స్థాయిలో ప్రతిదాడి చేసింది. మూడు రోజుల వ్యవహారాన్ని సమగ్రంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో కాంగ్రెస్ శాసనసభాపక్షం అనుసరించిన వ్యూహం ఫలించిందని సీఎం అభిప్రాయపడ్డారు.ఈ పరిణామాల మధ్య నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో బీఆర్ఎస్ గ్రాఫ్ భారీగా పడిపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీలో జరిగిన ప్రతి పరిణామాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్షం వ్యవహరించిన తీరుకు ప్రజల స్పందన సర్వేలో ప్రతిఫలించిందని సీఎం పేర్కొన్నారు.కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ ఎమ్మెల్యేల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ విధానాలను బలంగా వివరించడంతో పాటు, ప్రతిపక్షం లేవనెత్తే ప్రతి అంశానికి వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. సభలో కాంగ్రెస్ బలం, ప్రభుత్వ పనితీరు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఎమ్మెల్యేలంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.





# 'దవడ' దుమారం!

- అవును.. నా దవడ విరిగింది.
- విజయ్‌కు స్టాలిన్ స్ట్రాంగ్ కౌంటర్.
- అసెంబ్లీని సినిమా షూటింగ్ స్పాట్‌గా మార్చొద్దు.

**చెన్నై, మహా :** "తమ్ముడూ విజయ్.. నువ్వు చేసిన సంజ్ఞ నిజమే. అవును.. నా దవడ విరిగింది." తమిళనాడు రాజకీయాల్లో ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు తీవ్ర ప్రకంపనలు రేపుతున్నాయి. అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ చేసిన ఓ సంజ్ఞపై చెలరేగిన వివాదానికి డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తాజాగా వీడియో ద్వారా ఘాటుగా స్పందించారు. తనపై జరిగిన దాడి, ఎమర్జెన్సీ నాటి జైలు అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. సెప్టెంబర్ 7న పోలీసు శాఖ నిధులపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం విజయ్ డీఎంకేపై అవినీతి ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో ఎంకే స్టాలిన్ అరెస్టు, మిసా చట్టం గురించి ప్రస్తావిస్తూ తన దవడను చేత్తో పట్టుకుని సంజ్ఞ చేశారు. అయితే ఈ సంజ్ఞపై డీఎంకే, వామపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఎమర్జెన్సీ కాలంలో జైలులో పోలీసుల దాడిలో స్టాలిన్ దవడ ఎముకలు విరిగిన ఘటనను ఉద్దేశపూర్వకంగా ఎద్దేవా చేస్తూ విజయ్ బాడీ షేమింగ్‌కు పాల్పడ్డారని విమర్శలు వెల్లువెత్తాయి.వివాదం తీవ్రరూపం దాల్చడంతో విజయ్ వివరణ ఇచ్చారు. ఆ సంజ్ఞ అనుకోకుండా జరిగిందని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. అయితే తాజాగా స్టాలిన్ విడుదల చేసిన వీడియోతో ఈ వివాదం మరోసారి రాజకీయంగా వేడెక్కింది."1976 జనవరి 31న ఇందిరాగాంధీ ప్రభుత్వం కలైంజ్ఞర్ కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేసిన వెంటనే పోలీసులు గోపాలపురంలోని మా ఇంటికి వచ్చారు. నన్ను మిసా చట్టం కింద అరెస్టు చేశారు. మద్రాస్ సెంట్రల్ జైలులో మమ్మల్ని కుష్టు రోగుల వార్డులో ఉంచారు. రాత్రిళ్లు తన్నేవారు.. కొట్టేవారు. అదే దాడిలో నా దవడ ఎముకలు విరిగాయి. ఇప్పటికీ ఆ గాయాల మచ్చలు నా శరీరంపై ఉన్నాయి" అంటూ స్టాలిన్ తన గతాన్ని గుర్తుచేసుకున్నారు.ఆ సమయంలో తన సహచరుడు చిట్టిబాబు కూడా మృతి చెందారని స్టాలిన్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో తాను ఎదుర్కొన్న హింసను రాజకీయ ఎద్దేవాకు ఉపయోగించవద్దని పరోక్షంగా విజయ్‌కు సూచించారు.ఇదే సమయంలో విజయ్‌తో గతంలో జరిగిన వ్యక్తిగత భేటీని కూడా స్టాలిన్ ప్రస్తావించారు. "ఇంట్లో నన్ను కలిసినప్పుడు చెప్పిన మాట మర్చిపోయావా తమ్ముడు విజయ్?" అంటూ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచార సమయంలో తనపై తీవ్ర వ్యాఖ్యలు చేసినందుకు విజయ్ చింతిస్తున్నానని చెప్పి తన చేతులు పట్టుకున్నారని, తాను కూడా ఆ విషయాన్ని మనసులో పెట్టుకోలేదని స్టాలిన్ తెలిపారు. ఇతరులపై వ్యాఖ్యలు చేసేటప్పుడు హుందాతనం పాటించాలని అప్పుడే సూచించినట్లు వెల్లడించారు."నువ్వు ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడాలి.. ప్రవర్తించాలి. అసెంబ్లీని సినిమా షూటింగ్ స్పాట్‌లా, రీల్స్ చేసే ప్రదేశంలా మార్చకు" అంటూ విజయ్‌పై స్టాలిన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి అసెంబ్లీ గౌరవాన్ని, సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.మరోవైపు సర్కారియా కమిషన్ పేరుతో కరుణానిధిపై చేస్తున్న అవినీతి ఆరోపణలను కూడా స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షతోనే అప్పట్లో కరుణానిధిపై ఆ ఆరోపణలు సృష్టించారని, వాటిలో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో తమిళనాడు రాజకీయాల్లో ఇప్పటికే వేడెక్కిన విజయ్-డీఎంకే పోరు మరింత ముదిరినట్లయింది. అసెంబ్లీలో జరిగిన ఒక్క సంజ్ఞ చుట్టూ మొదలైన వివాదం.. ఇప్పుడు ఎమర్జెన్సీ చరిత్ర, రాజకీయ ఆరోపణలు, వ్యక్తిగత విమర్శల వరకు చేరుకోవడంతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

# ఎన్నికల తర్వాతే ఆర్టీసీ విలీనంపై నిర్ణయం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శాసనసభ, శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఆర్టీసీ భవిష్యత్ కార్యాచరణ, ఉద్యోగుల సమస్యలు, బస్సుల కొనుగోలు, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే అంశాలపై స్పష్టత ఇచ్చారు.గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని మూసివేసే పరిస్థితికి తీసుకొచ్చారని మంత్రి విమర్శించారు. ఆ సమయంలో ఒక్క బస్సును కూడా కొనుగోలు చేయలేదని, కొత్తగా ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆర్టీసీని తిరిగి గాడిలో పెట్టేందుకు చర్యలు ప్రారంభించామని తెలిపారు. సంస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ఇంకా కార్యాచరణలోకి రాలేదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2023లోనే గత ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 41 ద్వారా అధికారుల కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ విలీనం తర్వాత ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.ముందుగా ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, అందులో విజయం సాధించిన సంఘాల ప్రతినిధులను విలీన ప్రక్రియకు సంబంధించిన కమిటీలో భాగస్వామ్యం చేస్తామని మంత్రి తెలిపారు. వారి భాగస్వామ్యంతోనే విలీనానికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తామన్నారు. ఈ ప్రక్రియ కోసం కార్మిక శాఖ ప్రత్యేక అధికారిని నియమించామని, ప్రస్తుతం వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.ఇదిలా ఉండగా హైదరాబాద్ నగర ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు పీఎం ఈడ్రైవ్ పథకం కింద త్వరలో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని మంత్రి తెలిపారు. దీంతో నగరంలో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు ఆధునిక, పర్యావరణహిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. మరోవైపు 2017 నుంచి 2024 మధ్యకాలంలో పదవీ విరమణ చేసిన సుమారు 13 వేల మంది ఆర్టీసీ కార్మికులకు రూ.1,152 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉందని మంత్రి తెలిపారు. ఆర్థిక వెసులుబాటును బట్టి ఈ బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# తిరుమల శ్రీవారి హుండీకి కానుకల వెల్లువ


**ఒక్కరోజులో రూ.5.59 కోట్ల ఆదాయం**
**భక్తుల రద్దీతో కొత్త రికార్డు.**



**తిరుమల, మహా:** కలియుగ వైకుంఠం తిరుమలలో శ్రీవారి హుండీకి భక్తుల కానుకల వెల్లువ కొనసాగుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా హుండీ ఆదాయం కూడా భారీగా నమోదవుతోంది. తాజాగా ఒక్కరోజు హుండీ ఆదాయం రూ.5.59 కోట్లకు చేరడం విశేషం. టీటీడీ అధికారిక గణాంకాల ప్రకారం ఈ రికార్డు నమోదైన రోజున 71,297 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి కూడా భక్తులు తిరుమలకు తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు తమకు తోచిన విధంగా హుండీలో నగదు, బంగారం, వెండి తదితర కానుకలను సమర్పిస్తున్నారు. దీంతో శ్రీవారి హుండీ ఆదాయం గణనీయంగా పెరుగుతోంది.ఇటీవలి రోజుల్లోనూ హుండీ ఆదాయం కోట్ల రూపాయల్లో నమోదవుతోంది. సెప్టెంబర్ 7న రూ.4.08 కోట్లు, సెప్టెంబర్ 8న రూ.4.75 కోట్లు, సెప్టెంబర్ 9న రూ.5.59 కోట్ల హుండీ ఆదాయం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. భక్తుల రద్దీ కూడా కొనసాగుతోంది. టీటీడీ తాజా సమాచారం ప్రకారం సెప్టెంబర్ 9న 77,670 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. దీంతో తిరుమలలో సర్వదర్శనం కోసం భక్తుల రద్దీ పెరిగి వేచి ఉండే సమయం కూడా గణనీయంగా ఉన్నట్లు టీటీడీ వెల్లడించింది. శ్రీవారి హుండీకి వస్తున్న భారీ కానుకలు తిరుమల వెంకటేశ్వరస్వామిపై భక్తులకు ఉన్న అపారమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. భక్తుల రద్దీ, హుండీ ఆదాయం పెరుగుతుండటంతో తిరుమలలో ఆధ్యాత్మిక సందడి మరింతగా నెలకొంది.

# 37 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థి సంఘాల ఎన్నికలు.

- కర్ణాటక ప్రభుత్వ కీలక నిర్ణయం
- క్యాంపస్‌లలో ప్రజాస్వామ్యానికి కొత్త ఊపిరి.
- రాజకీయ పార్టీలకు నో ఎంట్రీ.



**బెంగళూరు,మహా:** దాదాపు 37 ఏళ్లుగా అమలులో ఉన్న నిషేధానికి తెరదించుతూ కర్ణాటక ప్రభుత్వం కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలను పునరుద్ధరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయానికి ఆమోదం లభించింది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి జి. పరమేశ్వర తెలిపారు.క్యాంపస్‌లలో హింస, ఘర్షణలు, రాజకీయ జోక్యం పెరగడంతో 1989లో అప్పటి వీరేంద్ర పాటిల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి సంఘాల ఎన్నికలను నిషేధించింది. ఆ తర్వాత విద్యార్థి రాజకీయాలపై ఆంక్షలు కొనసాగాయి. దాదాపు నాలుగు దశాబ్దాల విరామం అనంతరం ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ''విద్యార్థి ఎన్నికలను తిరిగి ప్రవేశపెడుతున్నాం'' అని మంత్రివర్గ సమావేశం అనంతరం పరమేశ్వర వెల్లడించారు. అయితే క్యాంపస్‌లలో రాజకీయ పార్టీల ప్రత్యక్ష జోక్యానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ కళాశాల పరిధిలో స్వతంత్రంగా పోటీ చేయాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీలు లేదా వాటి అనుబంధ విద్యార్థి సంఘాల పేరుతో ఎన్నికల్లో పోటీ చేయడం, ప్రచారం నిర్వహించడం అనుమతించబోరు.విద్యార్థి సంఘాల నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఒక ప్రత్యేక విధానాన్ని ప్రతిపాదించింది. ప్రతి కళాశాలలో ఒక అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ఒక ప్రధాన కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులతో పాటు ఆరుగురు సభ్యులతో కార్యవర్గం ఉండనుంది. ఇద్దరు ఉపాధ్యక్షుల్లో ఒకరు మహిళ అయి ఉండాలి. సంయుక్త కార్యదర్శుల్లో ఒక పదవి మహిళకు కేటాయించనున్నారు. కార్యవర్గంలోని ఆరుగురిలో ఇద్దరు మహిళలకు అవకాశం కల్పించనున్నారు.ఈ ఎన్నికల్లో కుల ఆధారిత రిజర్వేషన్లు ఉండవని ప్రభుత్వం స్పష్టం చేసింది. విద్యార్థి సంఘాల ఎన్నికలను కుల, రాజకీయ ప్రాతిపదికన కాకుండా విద్యార్థుల నాయకత్వం, ప్రతిభ, ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి వేదికగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు.అయితే ఎన్నికలు ప్రతి కళాశాలలో తప్పనిసరిగా నిర్వహించాలా? అనే అంశంలోనూ ప్రభుత్వం కొన్ని వెసులుబాట్లు కల్పించింది. విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించాలనే ఆసక్తి లేకపోతే అక్కడ ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని పరమేశ్వర తెలిపారు. విద్యార్థుల అభిప్రాయానికే ప్రాధాన్యం ఉంటుందని, కేవలం కళాశాల యాజమాన్యం నిర్ణయం ఆధారంగా ఎన్నికలు నిర్వహించడం లేదా నిలిపివేయడం ఉండదని వివరించారు.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి ప్రతినిధుల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. అయితే ఎన్నికలు ఎప్పుడు, ఏ విధానంలో నిర్వహించాలి? ఓటింగ్ ప్రక్రియ ఎలా ఉండాలి? వంటి పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం తదుపరి దశలో ఖరారు చేయనుంది.విద్యార్థి సంఘాల ఎన్నికలను పునరుద్ధరించడం వెనుక యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. భవిష్యత్‌లో ప్రజా జీవితంలోకి వచ్చే యువతకు విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య ప్రక్రియ, బాధ్యత, చర్చ, నిర్ణయాధికారం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లోనే విద్యార్థి సంఘాల ఎన్నికలను పునరుద్ధరించే ప్రతిపాదనను ప్రకటించింది.గతంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు రాజకీయ జోక్యం, హింస, బలప్రయోగానికి వేదికగా మారిన నేపథ్యంలో ఈసారి ప్రభుత్వం కఠిన నిబంధనలతో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. బయటి వ్యక్తులు క్యాంపస్‌లోకి వచ్చి ప్రచారం చేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఏ రాజకీయ పార్టీ లేదా విద్యార్థి సంస్థ పేరుతోనూ అభ్యర్థులు పోటీ చేయకుండా నియంత్రణలు విధించనున్నారు.

# రాష్ట్ర ఆర్థిక వృద్ధికి జిల్లాలే చోదక శక్తులు

( మొదటి పేజీ తరువాయి )

సహా వివిధ అంశాలను పరిగణించేందుకు 2022 23ను బేస్ ఇయర్ గా కేంద్రం నిర్ధారించిందని అధికారులు తెలిపారు. ప్రస్తుత ధరల మేరకు 2026-27 వృద్ధిరేటు అంచనా 13.44 శాతంగా నమోదైందని వెల్లడించారు. వ్యవసాయ అనుబంధ రంగాల జీవీఏ వృద్ధిరేటు 2026-27 తొలి త్రైమాసికంలో 14.19 శాతానికి పెరిగిందని, పరిశ్రమల రంగంలో 14.81 శాతం, సేవల రంగంలో 12.70 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. ఆక్వా రంగంలో 6.61 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో 31.77 శాతం వృద్ధి నమోదైందన్నారు.

**14.28 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం**

విద్యుత్ ఉత్పత్తి 24,248 మిలియన్ యూనిట్ల నుంచి 28,664 మిలియన్ యూనిట్లకు పెరిగిందని, విద్యుత్ వినియోగం 14.28 శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. ఇక పారిశ్రామిక ఉత్పత్తిలో తొలి త్రైమాసికంలో రూ.1,13,638 కోట్ల జీవీఏ నమోదైందని, సేవల రంగంలో 2026-27 తొలి త్రైమాసికానికి రూ.1,60,107 కోట్ల జీవీఏ నమోదైందని వివరించారు. జీఎస్టీ ఆదాయంలోనూ 18 శాతం మేర పెరుగుదల నమోదైందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలి



జెన్స్ టాస్క్‌ఫోర్స్ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన 20 రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని, రూ.13.85 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు, 10.6 లక్షల ఉద్యోగాలు వచ్చేలా ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో ఇప్పటికే 160 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, రూ.4.03 లక్షల కోట్ల పెట్టుబడులతో 5.9 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐపీబీలో అనుమతులు పొందిన ప్రాజెక్టులను వేగంగా గ్రౌండ్ చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను కూడా ఖరారు చేయాలని, ప్రాజెక్టులు గ్రౌండ్ కావడంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆదేశించారు.

**ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో ప్రస్తుతం తయారీ, సేవలు, వాణిజ్య రంగాల్లో 23.85 లక్షల ఎంఎస్ఎంఈలు ఉన్నాయని అధికారులు తెలిపారు. 175 ఎంఎస్ఎంఈ పార్కులకు గాను ఇప్పటికే 138 పార్కులకు ఆమోదం లభించిందని, 22 పార్కులు ప్రారంభమయ్యాయని, మిగతా 116 పార్కులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా రూ.2,036 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండగా, 31,163 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖ, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అక్టోబరులో ప్రాంతీయ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా నవంబరులో 2026 భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న హెలిప్యాడ్‌లను నోటిఫై చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వీటిని పర్యాటక రంగంతోనూ అనుసంధానించే అవకాశం ఉంటుందని సూచించారు. జిల్లా కేంద్రాల్లో నైట్ ల్యాండింగ్ ఫెసిలిటీలను ప్రారంభించేలా కేంద్రం నుంచి అనుమతులు పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణానికి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం ఆదేశించారు. జిల్లాల్లో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల పురోగతిని సమన్వయం చేస్తూ లక్ష్యాలను వేగంగా సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఉచిత సహాయ పరికరాలు

**రాజేంద్రనగర్, మహా:** గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు ఉచిత సహాయ పరికరాల పంపిణీ కోసం వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమగ్ర శిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో, సీఎంఓ బత్తిని వెంకటేష్ పర్యవేక్షణలో శిబిరం జరిగింది. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల స్వావలంబనకు ప్రభుత్వం వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, బ్రెయిలీ కిట్లు, ఎమ్మార్ కిట్లు ఉచితంగా అందజేస్తుందని అధికారులు తెలిపారు. అలింకో సహకారంతో అర్హులైన విద్యార్థులను గుర్తించి పరికరాలు అందించేందుకు ఈ శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు కిష్టారెడ్డి, సహిత విద్య వనరుల ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి చర్యలు

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండలం నర్కూడలోని ఇందిరమ్మ కాలనీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ గడ్డం శేఖర్‌యాదవ్ తెలిపారు. గ్రామపంచాయతీ నిధులతో గురువారం కాలనీలో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు 60 చదరపు గజాల చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, ప్రస్తుతం కాలనీ ప్రజలు మంచినీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యాల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు సౌకర్యం కోసం స్థానికులతో మాట్లాడి 30 అడుగుల రహదారికి స్థలం అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. త్వరలో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



## మట్టి గణపతిని పూజిద్దాం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించవచ్చన్నారు. 'మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు.



## ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 10, మహా:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని ఐలమ్మ చౌరస్తాలో ఆమె విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు కావలి నరసింహ మాట్లాడుతూ భూస్వామ్య, పెత్తందారీ దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. పేదలు, రైతులు, కూలీల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలమ్మ, మండల కార్యదర్శి కావలి సురేష్, మున్సిపల్ కార్యదర్శి బండి నరసింహ, పోల్కంపల్లి గ్రామ కార్యదర్శి గుండ్ల శీను తదితరులు పాల్గొన్నారు.







# చేదు జ్ఞాపకానికి 25 ఏళ్లు

## అమెరికా గుండెల్లో ఇంకా మారని '9/11' గాయం!

వాషింగ్టన్: మానవ చరిత్రలోనే అత్యంత భయానక, విధ్వంసకర ఉగ్రదాడి జరిగి నేటికి 25 ఏళ్లు గడిచాయి. 2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని ప్రతిష్ఠాత్మక న్యూయార్క్ ట్విన్ టవర్స్ (వరల్డ్ ట్రేడ్ సెంటర్) పై జరిగిన ఈ దాడి ప్రపంచ గమనాన్నే మార్చేసింది.

**అసలేం జరిగింది?**

2001 సెప్టెంబర్ 11న ఉదయం వేళ అమెరికా తూర్పు తీరం నుంచి ప్రయాణించే 4 వాణిజ్య విమానాలను ఉగ్రవాదులు తమ ఆధీనంలోకి తీసుకుని (హైజాక్ చేసి) క్షిపణుల్లా మార్చారు.

ఉదయం 8:46 గంటలకు: బోస్టన్ నుంచి ప్రయాణీకులతో బయల్దేరిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 11 విమానం మొదటగా వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఉత్తర టవర్ (నార్త్ టవర్) ను బలంగా ఢీకొట్టింది. మొదట అంతా దీన్ని ఒక ప్రమాదంగా భావించారు.

ఉదయం 9:03 గంటలకు: మొదటి దాడి జరిగిన 17 నిమిషాల వ్యవధిలోనే, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 175 విమానం ప్రత్యక్ష ప్రసారాల్లో చూస్తుండగానే దక్షిణ టవర్ (సౌత్ టవర్) లోకి దూసుకెళ్లింది. దీంతో ఇది ఉగ్రవాద దాడేనని ప్రపంచానికి స్పష్టమైంది.

ఉదయం 9:37 గంటలకు: అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 77 అనే మూడో విమానం వాషింగ్టన్ సమీపంలోని అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం 'పెంటగాన్' పశ్చిమ భాగాన్ని ఢీకొట్టింది.ఉదయం 10:03 గంటలకు: యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 93 అనే నాల్గో విమానం పెన్సిల్వేనియాలోని ఒక ఖాళీ మైదానంలో కూలిపోయింది. విమానంలోని ప్రయాణికులు ఉగ్రవాదులను ఎదిరించడం వల్ల, వాషింగ్టన్‌లోని క్యాపిటల్ బిల్డింగ్ లేదా వైట్ హౌస్‌ను ఢీకొట్టాలనే ఉగ్రవాదుల ప్లాన్ విఫలమైంది.

విమానాలు ఢీకొన్న తీవ్రతకు, భారీగా అంటుకున్న మంటల ధాటికి 110 అంతస్తుల ఆకాశహర్మ్యాలైన రెండు ట్విన్ టవర్స్ రెండు గంటల వ్యవధిలోనే కుప్ప కూలి బూడిద గుట్టలుగా మారాయి..

**దాడి చేసింది ఎవరు? ఎలా చేశారు?**

ఈ దారుణ ఉగ్రకాండకు సూత్రధారి ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ అల్‌ఖైదా. ఆ సంస్థ అప్పటి అధినేత ఒసామా బిన్ లాడెన్ నేతృత్వంలో ఈ కుట్ర జరిగింది. ఆత్మాహుతి దళం*: మొత్తం 19 మంది అల్‌ఖైదా ఉగ్రవాదులు 4 బృందాలుగా విడిపోయి ఈ దాడులకు పాల్పడ్డారు. *వ్యూహం*: వీరు అమెరికాలోనే ఉంటూ విమానాలు నడపడంలో ముందస్తు శిక్షణ తీసుకున్నారు. పక్కా ప్రణాళికతో ప్రయాణికుల విమానాలను హైజాక్ చేసి, పైలట్లను హతమార్చి లేదా పక్కన పెట్టి, తామే స్వయంగా విమానాలను భవనాల వైపు నడిపి ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డారు.

**25 ఏళ్ల తర్వాత నేటి పరిస్థితి**

ఈ దాడులు జరిగి పావు శతాబ్దం గడిచినా, ఆనాటి భయానక దృశ్యాలు నేటికీ ప్రపంచాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. ఈ దాడుల అనంతరం అమెరికా అంతర్జాతీయంగా ఉగ్రవాదంపై పెద్ద ఎత్తున యుద్ధం ప్రకటించింది. దాడికి కారణమైన ఒసామా బిన్ లాడెన్‌ను 2011లో పాకిస్తాన్‌లో అమెరికా సైన్యం హతమార్చింది. కూలిపోయిన ట్విన్ టవర్స్ స్థానంలో ప్రస్తుతం '9/11 మెమోరియల్ & మ్యూజియం' ను ఏర్పాటు చేసి, మరణించిన వారి జ్ఞాపకార్థం నివాళులు అర్పిస్తున్నారు.













# పోచమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఇనగాల

**హనుమకొండ, మహా ;** హనుమకొండ నగరంలోని న్యూ శాయంపేట 31వ డివిజన్‌లో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు యాదవ్, వేల్పుల మోహన్ రావుల ప్రత్యేక ఆహ్వానం మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని కొనియాడారు. న్యూ శాయంపేట 31వ డివిజన్ ప్రజలందరికీ, అలాగే హనుమకొండ జిల్లా ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాస్టర్ ట్రైనింగ్ కమిటీ మెంబర్ మారంరెడ్డి కౌటిల్ రెడ్డి, వేల్పుల రోహిత్, స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



# వలిగొండలో చాకలి ఐలమ్మ వర్ధంతి

**వలిగొండ సెప్టెంబర్ 10 మహా న్యూస్ :** వలిగొండ మండల కేంద్రంలో బీసీ సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి ఆధ్వర్యంలో సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అని వారు కొనియాడారుఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య నాయకులు మాజీ ఉపసర్పంచ్ పబ్బు సురేందర్మారగోనిశ్రీనివాస్ గౌడ్ ఎలిమినేటి సత్యనారాయణ బొడిగె సుదర్శన్ మైసొల్ల శంకర్ మైసొల్ల లక్ష్మీనరసు నరసింహ కాశీం యాదగిరి రామ నర్సు సాయి తదితరులు పాల్గొన్నారు




# కుటుంబ బాధ్యతలతో పాటు పీహెచ్‌డీ సాధించిన దీపా బానోత్

**కుషాయిగూడ, మహా:** కాప్రా ఈసీఐఎల్‌కు చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పరిశోధక విద్యార్థినిగా కొనసాగిన దీప బానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ పొందారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేయడం విశేషం. 'తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం' అనే అంశంపై ఆమె పరిశోధన చేపట్టారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తిని మెరుగుపరిచేందుకు పలు సూచనలను ప్రతిపాదించారు. ఈ పరిశోధనను డా. వి. సమున్నత పర్యవేక్షణలో పూర్తి చేశారు. దీపా బానోత్ పెద్ద కుమారుడు ఎంబీబీఎస్, చిన్న కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలోనూ కుటుంబ బాధ్యతలను చూసుకుంటూ తన పరిశోధనను కొనసాగించారు. సంకల్పం, పట్టుదల, నిరంతర కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్నప్పటికీ ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఆమె నిరూపించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, విభాగాధిపతి ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావు, అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది డా. దీపా బానోత్‌ను అభినందించారు. తన విజయానికి సహకరించిన భర్త శ్రీ రవి తేజ, కుటుంబ సభ్యులు, పరిశోధన పర్యవేక్షకురాలు డా. వి. సమున్నతకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన సమయంలో వారు అందించిన ప్రోత్సాహం, సహకారం తన పీహెచ్‌డీ ప్రయాణంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు.కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు తన విజయం స్ఫూర్తినిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# పారా లీగల్ వాలంటీర్లకు బాధ్యతలపై అవగాహన

**కుషాయిగూడ,మహా:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ చట్టం ముఖ్య ఉద్దేశాలు, లక్ష్యాలను పారా లీగల్ వాలంటీర్లకు వివరించారు. న్యాయ సేవలు అవసరమైన వారికి అందుబాటులోకి తీసుకెళ్లడంలో పారా లీగల్ వాలంటీర్ల పాత్ర కీలకమని తెలిపారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవలపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించేలా చేయడం వంటి అంశాలపై వివరించారు. పారా లీగల్ వాలంటీర్ల హక్కులు, బాధ్యతలు, విధుల నిర్వహణలో పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో



నిర్వహించాల్సిన నెలవారీ కార్యక్రమాలపై చర్చించారు. ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. సమావేశంలో 15 మంది పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# గురునానక్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు!

- **2026 పోటీలను ప్రారంభించిన ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ**
- **తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాల 91 జట్ల ఎంట్రీ**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 10 మహా:** గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ (జీఎన్ఐటీసీ), ఇబ్రహీంపట్నం, సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా, సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ దివంగత సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ స్మారకార్థం నిర్వహిస్తున్న, సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ జాతీయ స్థాయి క్రీడా పోటీలు-2026 గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలను గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ ఛైర్మన్, యూనివర్సిటీ, హైదరాబాద్ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ ప్రారంభించారు. ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. హెచ్. ఎస్. సైనీ, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, న్యాయబద్ధంగా, సురక్షితంగా ఆడి, క్రీడాస్ఫూర్తిని కాపాడాలని డా. సైనీ సూచించారు. క్రీడలు, క్రీడా పోటీలంటే ఎంతో ఆసక్తి కలిగిన దివంగత సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ స్మృతికి గుర్తుగా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మొత్తం 91 జట్లు పాల్గొంటున్నాయి. వాలీబాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్ బాలుర సింగిల్స్, బ్యాడ్మింటన్ బాలికల సింగిల్స్ మరియు టేబుల్ టెన్నిస్ బాలుర సింగిల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. జీఎన్ఐటీసీ డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ రెడ్డి స్వాగత ప్రసంగం చేయగా, అసోసియేట్ డైరెక్టర్ డా. రిషి సయల్ కృతజ్ఞతలు తెలిపారు. వేదికపై డా. బి. కేదార్‌నాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ - ఫస్ట్ ఇయర్ బీ.టెక్., డా. సందీప్ పాటిల్, డీన్- ఐక్యూఏసీ పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణలో కన్వీనర్ మరియు ఫిజికల్ డైరెక్టర్ పి. ప్రభాకర్ కీలక పాత్ర పోషించారు. ప్రారంభ కార్యక్రమానికి వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, కోచ్‌లు, రిఫరీలు, ఫిజికల్ డైరెక్టర్లు మరియు అధ్యాపకులు హాజరయ్యారు. గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు, విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక కల్పించడంతో పాటు క్రీడాస్ఫూర్తి, జట్టుగా పనిచేసే తత్వం, ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు.

# చిట్యాల(చాకలి) ఐలమ్మ 41వ వర్ధంతి



**జవహర్ నగర్, మహా :** .తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు దొరతనాన్ని ధిక్కరించిన దీశాలి చిట్యాల(చాకలి) ఐలమ్మే అని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస గుప్తా పేర్కొన్నారు. జవహర్ నగర్ లోని శ్రీ లక్ష్మీనరసింహ కాలనీలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు గురువారం శ్రీ లక్ష్మీ నరసింహ కాలనీ రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఐలమ్మ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ నిజాం మీరు ఉస్మాన్ అలీ ఖాన్ కాలంలో హైదరాబాద్ సంస్థానంలో సంస్కరణ ఉద్యమాలు మొదలయ్యా యని తెలంగాణ నాయకులు మొదట ఆంధ్ర జన సంఘం పేరుతో 1921న ఉద్యమాలు మొదలుపెట్టారన్నారు. ఈ సంస్థని ఆ తర్వాత నిజం రాష్ట్ర ఆంధ్ర మహాసభగా మార్పు చెందింది .1930వ సంవత్సరంలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన మెదక్ జిల్లా జోగిపేటలో తొలి సంస్థ సభ జరిగింది. దీంతో తెలంగాణ ఆంధ్ర ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆంధ్ర మహాసభ సంఘం పేరుతో కార్యక్రమాలు నిర్వహించింది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా ఆంధ్ర మహాసభ కార్యదర్శి ఆరుట్ల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పాలకుర్తిలో సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరుట్ల మీద విసునూరు రామచంద్రారెడ్డి మనుషులు దాడికి ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఆ సభలో ఉన్న విసునూరు గుండాలను అడ్డుకున్నారు. ఇట్లా అడ్డుకున్న వాళ్లల్లో చాకలి ఐలమ్మ భర్త నరసయ్య ఇద్దరు కొడుకులు లచ్చయ్య సోమయ్య కూడా ఉన్నారు. ఈ సంఘటనలో విసునూరు గుండా వనమాల వెంకన్న తలకు దెబ్బలు కలిగినాయి. విసునూరు దొర ఆడించినట్టు ఆడే పోలీసులు అనేకమంది ఆంధ్ర మహాసభ కార్యకర్తల మీద హత్యాయత్నం కేసు పెట్టారు. ఈ నేపంతో ఆరుట్ల రామచంద్రారెడ్డి తో పాటు చిట్యాల ఐలమ్మ కుటుంబ సభ్యులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. బీడీలు వేసి రోడ్లమీద నడిపించారు. పోలీస్ స్టేషన్లో చిత్రహింసలకు పెట్టారు. ఈ సమయంలో ఆంధ్ర మహాసభ ఐలమ్మ కుటుంబానికి అండగా నిలబడింది. ఈ విధంగా విసునూరు దొరను ఎదిరించిన ఐలమ్మ పోరాటం ప్రజలకు ప్రేరణ కలిగించిందని ఆంధ్ర మహాసభ బలపడడానికి ఉపయోగపడ్డదని ఉద్యమాన్ని రైతాంగ సాయుధ పోరాటంగా మార్చిందని రెడ్డి శెట్టి శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రజల బానిస మనస్తత్వాన్ని పోగొట్టింది భూస్వామ్య వ్యవస్థను కూల్చింది తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన వీరనారి చాకలి ఐలమ్మేనని పేర్కొన్నారు. అటువంటి చాకలి ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10వ తేదీన మరణించింది అని ఆ వీరనారి త్యాగాలు యావత్ జవహర్ నగర్ ప్రజలు గుర్తించుకోవాలన్నారు. బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మేలని ఆమె 41 వర్ధంతి వేడుకలు జరుపుకోవడం ముదా భావమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, బి ఆర్ ఎస్ అధ్యక్షుడు కొండల ముదిరాజ్, లక్ష్మీనరసింహ స్వామి కాలనీ ఫేస్ వన్ వెల్ఫేర్ అధ్యక్షులు శ్రీకాంత్, లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్, రజక సంఘం అధ్యక్షులు గుమ్మడి రాజు, వెంకన్న, లక్ష్మీనారాయణ, అంజిరెడ్డి, గోపి, సోమన్న, వీరయ్య, సంపత్, శ్రవణ్, పాపయ్య, కొమరయ్య, శంకరయ్య, శంకర్, బుచ్చి రాములు, సుమన్, నరేష్, రాములు, యాకయ్య, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా పగ్గాలు ఇమ్రాన్‌కు

- **పదేళ్ల విద్యార్థి ఉద్యమ ప్రస్థానానికి గుర్తింపు**
- **జిల్లా అధ్యక్షుడిగా నియామకం**

**కరీంనగర్ మహా :** విద్యార్థుల సమస్యలపై ఉద్యమిస్తూ, కాంగ్రెస్ విద్యార్థి విభాగంలో దశాబ్దకాలంగా క్రియాశీలకంగా పనిచేస్తున్న మహమ్మద్ ఇమ్రాన్‌కు ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా అధ్యక్ష పదవి దక్కింది. ఆయనను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఏడవల్లి వెంకటస్వామి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ, విద్యార్థి సంఘం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన కార్యకర్తకు కీలక బాధ్యతలు అప్పగించడంతో ఎన్ఎస్‌యూఐ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కళాశాల అధ్యక్షుడిగా విద్యార్థి రాజకీయాల్లో అడుగుపెట్టిన మహమ్మద్ ఇమ్రాన్.. అనంతరం ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ ఇన్‌చార్జ్‌గా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్‌గా కూడా ఆయన పనిచేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పలు కార్యక్రమాలు, పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు.పార్టీ ఆదేశాలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తా తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఏడవల్లి వెంకటస్వామికి మహమ్మద్ ఇమ్రాన్ కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్లుగా విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న తన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ ఆదేశాలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తూ, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కరీంనగర్ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ బాబులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎస్‌యూఐని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీకి, విద్యార్థి సంఘానికి అంకితభావంతో పనిచేస్తానని ఇమ్రాన్ పేర్కొన్నారు.





# ఎన్ఎస్ యు ఐ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా ఆనంద్...

**రాజేంద్రనగర్ మహా ;** విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, విద్యార్థి హక్కుల కోసం ఉద్యమిస్తున్న జిల్లా ఆనంద్‌ను గురువారం ఎన్ ఎస్ యు ఐ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. విద్యార్థి వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా జిల్లా ఆనంద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ స్వామి, అక్బర్, రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్ లకు తన రాజకీయ ప్రస్థానంలో ఎల్లప్పుడూ ప్రోత్సాహస్తున్నా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విద్యార్థుల కోసం మరింత బాధ్యతగా పనిచేసే అవకాశం కల్పించారన్నారు. విద్యార్థుల సమస్య ఎక్కడ ఉంటే అక్కడ నా గొంతు వినిపిస్తుంది. విద్యార్థుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని జిల్లా ఆనంద్ స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఎన్ ఎస్ యు ఐ ని మరింత బలోపేతం చేసి, ప్రతి కళాశాలలో విద్యార్థుల సమస్యలపై పోరాడే బలమైన నాయకత్వాన్ని నిర్మిస్తానని తెలిపారు.



# చోరీ కేసులో వ్యక్తి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మేకలబండ తండాలో మంగళవారం నిర్మాణ స్థలంలో ఉన్న సెంట్రింగ్ సామగ్రి, ఐరన్ కట్టింగ్ మెషిన్, ఐరన్ వస్తువులు కనిపించకపోవడంతో శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో సదురు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితుడు షేక్ సోహైల్ (26), షాహీన్ నగర్, బార్కాస్, హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి చోరీకి గురైన సుమారు రూ.20,000 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రిమాండ్ తరలించారు.



# మీరు పేట డివిజన్ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలిగా భాగవతుల శశికళ

**కుషాయిగూడ, మహా :** మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా భాగవతుల శశికళ నియమితులయ్యారు. ఈ మేరకు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ నియమించారు. భాగవతుల శశికళ గతంలో సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ పార్టీలో పనిచేశారు. అనారోగ్య కారణాలతో ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన అనంతరం బీజేపీలో చేరి క్రియాశీల కార్యకర్తగా కొనసాగుతున్నారు. 2012 నుంచి 2026 వరకు తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేసి స్థానికంగా ప్రజల ఆదరాభిమానాలను పొందారు. మీర్‌పేట హౌసింగ్ బోర్డు డివిజన్‌లోని వివిధ కాలనీల ప్రజలతో ఆమెకు సత్సంబంధాలు ఉన్నాయి. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. డివిజన్‌లో పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటూ, పార్టీ నాయకత్వానికి అందుబాటులో ఉంటూ ముందువరుసలో పనిచేస్తున్నారని తెలిపారు. మూడోసారి మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలిగా తనను నియమించినందుకు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే భేది సుభాష్ రెడ్డి. బీజేపీ జిల్లా నాయకత్వానికి శశికళ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని, నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆమె తెలిపారు. శశికళ నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# ఈసీఐఎల్‌లో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ రజక సమితి అధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ప్రముఖులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ,బిజెపి రాష్ట్ర నాయకులు బేతి సుభాష్ రెడ్డి, సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య ముఖ్య అతిథులుగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని అన్నారు. మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆ యోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికీ ఎంతో స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, బొంతు శ్రీదేవి, పావని మణిపాల్ రెడ్డి బిఆర్ఎస్ నేత సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, కొత్త అంజిరెడ్డి కాసం మహిపాల్ రెడ్డి, నాగిళ్ల బాల్ రెడ్డి, యాదగిరి రావు,మోహన్ రెడ్డి, బేతాళ బాలరాజు, సుడుగు మహేందర్ రెడ్డి అల్లూరయ్య శ్రీకాంత్ ఏనుగు సీతారాం రెడ్డి రహీం జయరాం మణమ్మ యాకయ్య భాష మహేష్ శ్రీనివాస్ యావపురం రవి అశోక్ పద్మారెడ్డి గడ్డం శ్రీనివాస్ వెంకట్ శ్రీనివాస్ సత్యం రవి తెలంగాణ రజక సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శనిగరం అశోక్, రాష్ట్ర అధ్యక్షులు ముంజంపల్లి రాములు, రాష్ట్ర ప్రధానu కార్యదర్శి గుమ్మడి రాజు, సోమయ్య రాష్ట్ర కార్యదర్శి సకినాల రవి, రాష్ట్ర కోశాధికారి జంజీరాల సత్యనారాయణ, రత్నాల కనకయ్య, కర్ణాకర్ కొమురయ్య, నరేష్ శ్రీకాంత్, యాకయ్య. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ సేవలు మరువలేము...

**బిఆర్ఎస్ నాయకులు దిద్యాల శ్రీనివాస్**

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను శంషాబాద్ మండలం లోని పెద్దతూప్ర గ్రామంలో రజక సామాజిక వర్గం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పెద్ద తూప్ర గ్రామంలో ఆమె విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దిధ్యాల శ్రీనివాస్,సర్పంచ్ అంకం సుమలత రాజు యాదవ్ , ఉప సర్పంచ్ దిధ్యాల శేఖర్ తో కలిసి పూల మాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించారు.

**బిఆర్ఎస్ నాయకులు దుద్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ**

తెలంగాణ సమాజంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం నైజాం నిరంకుశత్వానికి, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ స్ఫూర్తిని ఈ సందర్భంగా స్మరించుకుంటున్నమున్నారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు ధిధ్యాల నరేష్ కుమార్, అశోక్, శివ యాదవ్, దిధ్యాల గౌతమ్,జయం రాజు, చెన్నకేశవ్, బి విజయ్, ఎన్. కృష్ణ, ఎన్ శ్రీచరణ్,టి దాస్, ఎన్ మహేష్, రజక వర్గా సభ్యులు, నాయకులు, తధితరులు పాల్గొన్నారు.



## దళితులు నడిస్తే నేల మైల పడుతుందా?

**కరీంనగర్ మహా**: దళితులు నడిచిన రోడ్డును పాలు, పసుపు నీటితో శుద్ధి చేయడంపై కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నడిచిన మార్గాన్ని బీఆర్ఎస్ నాయకులు శుద్ధి చేశారంటూ ఆరోపిస్తూ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టీపీసీసీ ఎస్సీ సెల్ ఆదేశాల మేరకు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వెయ్యి డప్పులతో శాంతియుత నిరసన నిర్వహించినట్లు అరుణ్‌కుమార్ తెలిపారు. అనంతరం దళితులు నడిచిన రోడ్డును 'అపవిత్రమైందంటూ' పాలు, పసుపు నీటితో శుద్ధి చేయడం అత్యంత అవమానకరమన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్నా దళితులపై ఇలాంటి వివక్ష కొనసాగడం దురదృష్టకరమని అన్నారు. దళితులు నడిస్తే నేల మైల పడిపోతుందా? అంటూ ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, కుల వివక్షకు తావిచ్చే చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను సహించబోమని, బీఆర్ఎస్ నాయకులు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో మరింత తీవ్రంగా నిరసనలు చేపడతామని అరుణ్‌కుమార్ హెచ్చరించారు.

## హామీల అమలుపై ప్రశ్నిస్తే అరెస్టులా?

- **చలో హైదరాబాద్‌కు వెళ్లకుండా బీఆర్ఎస్ యువజన నాయకుడి ముందస్తు అరెస్ట్**

**పాలకుర్తి, సెప్టెంబర్ 10 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు,నిర్బంధాలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా, పాలకుర్తి మండల బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ మాదాసు అరవింద్ మరియు మండల యూత్ నాయకులు నెలగంటి శ్యామ్ గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఆయన నివాసంలో బసంత్‌నగర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఇటీవల మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే అరెస్టులు, నిర్బంధాలతో గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు.

## దళితుల అడుగులపై 'శుద్ధి'.. బీఆర్ఎస్ నేతలపై చర్యలకు ఫిర్యాదు



**కరీంనగర్ మహా:** దళితులు నిరసనకు వచ్చిన రహదారులను 'అపవిత్రం'గా భావించి పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వివాదానికి దారితీసింది. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ పరిసర ప్రాంతంలో దళితులు నిరసన చేపట్టిన అనంతరం రహదారులపై పసుపు నీళ్లు చల్లి శుద్ధి కార్యక్రమం నిర్వహించడాన్ని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ ఘటనకు బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ నెల 7న అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, ఎన్. నవీన్ కుమార్ రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఆయన దివంగత తల్లిని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని కవ్వంపల్లి ఆరోపించారు. దీనికి నిరసనగా 'డప్పుల దండోరా' కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం ఎర్రవల్లి ఫాంహౌస్ పరిసరాల నుంచి నిరసనకారులు వెళ్లిపోయిన తర్వాత రహదారులపై పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారని ఆరోపించారు.దళితులు నడిచిన రహదారిని శుద్ధి చేయడం కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్యగా కవ్వంపల్లి పేర్కొన్నారు. శుద్ధి కార్యక్రమాన్ని సమర్థిస్తూ బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు సోషల్ మీడియాలో చేసిన పోస్టుపైనా ఆయన ఫిర్యాదు చేశారు. ఘటనకు బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, బీఎన్ఎస్, ఐటీ చట్టంలోని వర్తించే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సర్పంచ్ చొరవతో విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యకు పరిష్కారం

**గ్రామంలో రెండు నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లు ఏర్పాటు**

**జూలూరుపాడు, మహా:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధి అనంతారం గ్రామంలో కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యను గ్రామ సర్పంచ్ కొర్సా రమేష్ విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో పరిష్కరించారు. గురువారం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు రెండు కొత్త విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లను ఏర్పాటు చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి రావడంతో ఓవర్‌లోడ్ సమస్య తగ్గడంతో పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కూడా తగ్గుతుందని గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను గుర్తించి వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన గ్రామ సర్పంచ్ రమేష్ కు విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంజీపీ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తు చేసుకోండి

**విదేశీ విద్యకు బాటలు వేయండి**
**జిల్లా కలెక్టర్ రాజర్షిషా వెల్లడి**



**ఆదిలాబాద్ మహా:** విదేశాల్లో ఉన్నత విద్యలు అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. 2026 ఆగస్టు సెప్టెంబర్ ఫాల్ సెషన్‌కు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన విద్యార్థులు ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ పథకం కింద మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం లభిస్తుందని వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5 లక్షలలోపు ఉండాలని, దరఖాస్తు చేసే సమయానికి వయస్సు 35 సంవత్సరాలు దాటకూడదని పేర్కొన్నారు. డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో పాటు, జిఆర్ఇ 260 మార్కులు లేదా జిమ్యాట్ 500 మార్కులు , టోఫెల్ 60 మార్కులు లేదా ఐఇఎల్‌టిఎస్ ,పిటిఇ పరీక్షలలో ఏదో ఒకదానిలో అర్హత సాధించి ఉండాలని వివరించారు.ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీవోవీ .ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# మోగని శంఖం.. ఆగని సమరం!

- **చలో హైదరాబాద్ వాయిదా.. ఉద్యోగుల అసంతృప్తి మాత్రం రగులుతూనే**
- **ప్రభుత్వ విజ్ఞప్తికి తాత్కాలిక విరామం.. 18న తేలనున్న తదుపరి దశ**
- **కరీంనగర్ నుంచి 10 వేల మందికి పైగా సన్నద్ధత.. 5 వేల మందితో సన్నాహక సభ**



**కరీంనగర్ మహా :** సమర శంఖం మోగాల్సిన వేళ.. ఒక్కసారిగా విరామం. కానీ ఇది వెనకడుగు కాదు. చలో హైదరాబాద్ వాయిదా పడింది.. ఉద్యోగుల ఆవేదన మాత్రం వాయిదా పడలేదు. ఉద్యమానికి తాత్కాలిక విరామం వచ్చింది.. అసంతృప్తికి కాదు. ప్రభుత్వ విజ్ఞప్తికి గౌరవం ఇచ్చి రాష్ట్ర జేఏసీ ఒక అడుగు వెనక్కి వేసింది. ఇప్పుడు ప్రభుత్వం ముందు ఉన్నది ఒక కీలక అవకాశం. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తెస్తుందా? లేక 18 తర్వాత మరోసారి ఉద్యోగుల ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీఆర్సీ నివేదికను త్వరగా సమర్పించాలని ఆదేశించడంతో పాటు, సీపీఎస్‌పై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక సమస్యలపై ఈ నెల 18న మరోసారి చర్చించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో గురువారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జేఏసీ తాత్కాలికంగా వాయిదా వేసింది.

**కరీంనగర్‌లో ఉప్పెనలా సన్నద్ధత**

చలో హైదరాబాద్‌కు కరీంనగర్ జిల్లా నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అంగన్వాడీ ఉద్యోగులు పెద్ద ఎత్తున సన్నద్ధమయ్యారు.ఈ నెల 8న కరీంనగర్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశానికి సుమారు 5 వేల మంది హాజరై తమ ఉద్యమ స్ఫూర్తిని చాటారని జిల్లా జేఏసీ నాయకులు తెలిపారు. జిల్లా నుంచి 10 వేల మందికి పైగా హైదరాబాద్ తరలివెళ్లేందుకు వాహనాలను సిద్ధం చేసుకున్నారని, పలువురు సామూహిక సెలవులకు సైతం సిద్ధమయ్యారని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల వివిధ విభాగాలు ఒకే వేదికపైకి రావడం ద్వారా తమ సమస్యల తీవ్రతను ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేశామని నాయకులు అన్నారు.

**సమస్యలపై అసంతృప్తి**

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీఆర్సీ అమలు కాకపోవడం, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండడం, ఉద్యోగులు-పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు, ఆరోగ్య బీమా పథకం అమలులో సమస్యలు కొనసాగడం వంటి అంశాలపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందని జేఏసీ నాయకులు పేర్కొన్నారు.
సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను కూడా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు పోరాటానికి సిద్ధమైనా.. ప్రజలకు అసౌకర్యం కలగకూడదనే బాధ్యతతోనే ప్రస్తుతం సంయమనంతో వ్యవహరిస్తున్నామని తెలిపారు.

**ప్రభుత్వం ఇచ్చిన హామీలే ఇప్పుడు కీలకం**

ఉద్యోగుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం పీఆర్సీ నివేదికను త్వరగా తెప్పించుకోవాలని నిర్ణయించింది. సీపీఎస్‌పై అధ్యయనం చేసేందుకు నిపుణులు, అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని అంగీకరించింది. అదేవిధంగా పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక అంశాలపై ఈ నెల 18న జేఏసీ ప్రతినిధులతో చర్చించనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో ఇప్పుడు ఉద్యోగుల దృష్టి మొత్తం 18వ తేదీ సమావేశంపైనే నిలిచింది.

**"చల్లబడలేదు.. వేచి చూస్తున్నాం"**

చలో హైదరాబాద్ వాయిదా పడటంతో ఉద్యోగుల ఉద్యమం చల్లారిందని భావించడం సరికాదని కరీంనగర్ జిల్లా జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. "ప్రభుత్వ విజ్ఞప్తి మేరకే తాత్కాలికంగా కార్యక్రమాన్ని వాయిదా వేశాం. ఇది ఉద్యమ విరమణ కాదు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ఒక అవకాశం ఇచ్చాం. 18న సానుకూల నిర్ణయాలు రాకపోతే రాష్ట్ర జేఏసీ ప్రకటించే తదుపరి కార్యాచరణకు ఉద్యోగులు సిద్ధంగా ఉంటారు" అని తెలిపారు. నిగురుగప్పిన నిప్పులా ఉద్యోగుల అసంతృప్తి ఉందని.. సహనాన్ని బలహీనతగా భావించరాదని హెచ్చరించారు. రాష్ట్ర జేఏసీ కూడా 18న సమస్యలపై పురోగతి లేకపోతే 19న అత్యవసర సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేసింది.
ఒక అడుగు వెనక్కి..

**వ్యూహం మాత్రం ముందుకే**

చలో హైదరాబాద్ వాయిదా నిర్ణయాన్ని కొందరు ఉద్యోగులు అసంతృప్తితో స్వీకరించినప్పటికీ.. జేఏసీ నాయకత్వం మాత్రం దీనిని వ్యూహాత్మక నిర్ణయంగా అభివర్ణిస్తోంది. ప్రత్యక్ష సమరానికి సిద్ధమైన ఉద్యోగ బలం ఇప్పుడు వెనక్కి వెళ్లలేదు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలవుతాయా లేదా అన్నది గమనిస్తోంది. 18వ తేదీ నాటికి పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, సీపీఎస్, హెల్త్ కార్డులు తదితర అంశాలపై స్పష్టమైన పురోగతి కనిపిస్తే పరిస్థితి సద్దుమణిగే అవకాశం ఉంది. లేదంటే 19 నుంచి మరో దశ ఉద్యమానికి రంగం సిద్ధమయ్యే అవకాశముంది.

**"ఇది ఉద్యోగుల విజయం"**

వేలాది మంది ఉద్యోగులు ఒకే వేదికపైకి రావడం, చలో హైదరాబాద్‌కు భారీగా సన్నద్ధం కావడం వల్లే ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చిందని కరీంనగర్ జిల్లా జేఏసీ నాయకులు పేర్కొన్నారు. "మన అసంతృప్తిని ప్రభుత్వం గమనించింది. మన ఆవేదనను పాలకులు గుర్తించారు. మన ఐక్యత ప్రభుత్వాన్ని చర్చల టేబుల్ వద్దకు తీసుకొచ్చింది. ఇది ఉద్యోగుల విజయం.. ఉద్యమకారుల విజయం" అని అన్నారు. 18వ తేదీ వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు ఓపికతో ఉండాలని, అనంతరం రాష్ట్ర జేఏసీ తీసుకునే నిర్ణయానికి ఐక్యంగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, కన్వీనర్, టీజీవోల జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్ గౌడ్, టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, టీజీవోల జిల్లా కార్యదర్శి అడ్ల అరవింద్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోటా రామస్వామి, పెన్షనర్ల సంఘం నాయకులు ఉస్మాన్‌పాషా, కేశవరెడ్డి, ప్రభాకర్‌రావు, టీఎన్జీవోల కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అణచివేతపై అలుపెరగని పోరు.. ఐలమ్మ

- **ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం**
- **రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్**

**సత్తుపల్లి, సెప్టెంబరు 10:మహా :** అణచివేతను ఎదిరించి ఆత్మగౌరవం, హక్కుల కోసం వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సత్తుపల్లి మెయిన్ రోడ్డులోని ఆమె విగ్రహానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ "హక్కుల కోసం వెనుకడుగు వేయకుండా పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఆమె పోరాటం ప్రతీక. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి" అని అన్నారు. ఐలమ్మ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకురాలు కాదని, అన్యాయాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరికీ ఆమె జీవితం ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను స్మరించుకోవడంతో పాటు సమాజంలో సమానత్వం, గౌరవం, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సత్తుపల్లి-వేంసూరు రోడ్డులోని ధోబీఘాట్ లో పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో దయానంద్ పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనందబాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, రజక సంఘం అధ్యక్షుడు విరివాడ నాగభూషణం, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.





## వసతి గృహాల్లో వైద్య శిబిరం..

**జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినులకు రక్త పరీక్ష**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎంజేపీటీబీసీ బాలికల వసతి గృహం, అంబేద్కర్ సెంటర్‌లోని ఏజీహెచ్ఎస్ బాలికల వసతి గృహంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఉమాదేవి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న విద్యార్థినులకు అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థినులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు తడి దుస్తులు ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన తాగునీటినే తీసుకోవాలని తెలిపారు. వసతి గృహాల పరిసరాలను పరిశీలించిన వైద్య బృందం పారిశుధ్య నిర్వహణపై తగిన సూచనలు చేసింది. వైద్య శిబిరంలో సీహెచ్‌వో వీరస్వామి, పీహెచ్ఎన్ సత్తెమ్మ, హెల్త్ అసిస్టెంట్లు కృష్ణ, పార్వతి, అను సూర్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మేడిపల్లి చొరవ.. కొండగట్టుకు సీఎం వరం!

- **రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు రేవంత్‌రెడ్డి ఆమోదం..**
- **2 వేల మందికి దీక్షా విరమణ మండపం.. 96 గదుల సత్రం**



**కొండగట్టు మహా:** ఏళ్లుగా భక్తుల ఎదురుచూపులు.. నిలిచిపోయిన అభివృద్ధి పనులు.. ఇక గతమే. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి క్షేత్రంలో రూ.35.19 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతో క్షేత్ర అభివృద్ధికి కొత్త అధ్యాయం మొదలైంది. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో సీఎంను కలిసి చేసిన విజ్ఞప్తికి సానుకూల స్పందన లభించింది. దీంతో ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్ష విరమించేలా ఆధునిక మండపం, దూర ప్రాంత భక్తుల కోసం 96 గదుల సత్రం నిర్మాణానికి మార్గం సుగమమైంది. త్వరలో టెండర్లు.. ఆ వెంటనే పనులు ప్రారంభం కానున్నాయి.

**నిలిచిపోయిన పనులకు మళ్లీ కదలిక**

కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రం రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటి. నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు ఆంజనేయ దీక్షలు చేపడుతుంటారు. అయితే వివిధ కారణాలతో కొన్ని అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో జాప్యం ఏర్పడింది.
ఈ నేపథ్యంలో కొండగట్టు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పెండింగ్‌లో ఉన్న పనుల పరిస్థితిని వివరించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పనులకు ఆమోదం ఇవ్వాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రూ.35.19 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు.

**ఒకేసారి 2 వేల మందికి దీక్ష విరమణ**

కొండగట్టులో ఆంజనేయ దీక్షలు చేపట్టే భక్తుల సంఖ్య గణనీయంగా ఉంటుంది. దీక్ష విరమణ సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఒకేచోటకు చేరడంతో సౌకర్యాల కొరత తలెత్తకుండా అత్యాధునిక వసతులతో దీక్షా విరమణ మండపాన్ని నిర్మించనున్నారు.ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్ష విరమించేలా మండపాన్ని తీర్చిదిద్దనున్నారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన మౌలిక వసతులు కల్పించనున్నారు. దీంతో దీక్ష విరమణ సమయంలో భక్తులకు ఎదురయ్యే ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయి.

**దూర ప్రాంత భక్తులకు 96 గదుల సత్రం**

కొండగట్టుకు కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. దీక్షలు చేపట్టే భక్తులతో పాటు కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనానికి వచ్చే వారికి వసతి సౌకర్యం కీలకం. అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని 96 గదులతో సత్రాన్ని నిర్మించనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. క్షేత్రంలో వసతి సామర్థ్యం పెరగడంతో భక్తుల రద్దీ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

**త్వరలో టెండర్లు.. ఆ వెంటనే పనులు**

సీఎం ఆమోదంతో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు ఇప్పుడు కార్యరూపం దాల్చే అవకాశం ఏర్పడింది. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నారు. కొండగట్టుకు వచ్చే భక్తుల ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ రద్దీని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులను బలోపేతం చేయనున్నారు.

**భక్తుల సౌకర్యమే లక్ష్యంగా..**

కొండగట్టు అభివృద్ధికి రూ.35.19 కోట్ల పనులకు ఆమోదం లభించడం ద్వారా క్షేత్రంలో భక్తుల సౌకర్యాలకు మరింత ప్రాధాన్యం లభించనుంది. ముఖ్యంగా దీక్షా విరమణ మండపం, సత్రం నిర్మాణాలు పూర్తయితే వేలాది మంది భక్తులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది.కొండగట్టు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పనులకు ఆమోదం సాధించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



## చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి మహా, సెప్టెంబర్10 :** సమానత్వానికి, వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పేదల భూములు, భుక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, ఆమె ధైర్యసాహసాలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె పోషించిన పాత్ర చరిత్రలో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. 1895 సెప్టెంబర్ 26న వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కృష్ణాపురం గ్రామంలో జన్మించిన చాకలి ఐలమ్మ.. విస్నూర్ దేశ్‌ముఖ్, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఎదురు తిరిగి తెలంగాణ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని కలెక్టర్ గుర్తుచేశారు. తొలి భూ పోరాటాలకు నాంది పలికిన వీరమాతగా చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం. రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూ, యూనిఫాం పంపిణీ చేసిన సర్పంచ్

**సౌకర్యాల కల్పనకు సర్పంచ్ హామీ**

**కారేపల్లి, మహ :** మండల కేంద్రంలోని సింగరేణి ప్రాథమిక పాఠశాలవిద్యార్థులకు షూ, యూనిఫాం దుస్తులను సింగరేణిసర్పంచ్ మేదర వీరప్రతాప్ (టోనీ) గురువారం పంపిణీ చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం విద్యారులకు అందజేసిన దుస్తులను సర్పంచ్ అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పాఠశాలలో సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల చదువుల విషయంలో పేద కుటుంబాలకు ఎలాంటి అర్థిక ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, షూలు అందించటమే కాక అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో పాఠశాలల అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఎండీ.జాకీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.



# లిఖితపూర్వక హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

- 'చలో హైదరాబాద్' తాత్కాలిక వాయిదా
- టీజీఈ జేఏసీ ఛైర్మన్ అమరనేని రామారావు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వమే ముందుకు వచ్చి లిఖిత పూర్వక హామీ ఇవ్వడం వల్లనే 'చలో హైదరాబాద్' తాత్కాలిక వాయిదా వేయడం జరిగిందని టీజీఈ జేఏసీ ఛైర్మన్ అమరనేని రామారావు, జిల్లా కన్వీనర్ సంఘం వెంకట పుల్లయ్య, పి.ఆర్.టి.యు టీఎస్ జిల్లా అధ్యక్షులు నరసయ్యలు తెలిపారు. గురువారం యుటిఎఫ్ భవనంలో భద్రాద్రి జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ గెజిటెడ్ అధికారుల కార్మిక పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ నిర్ణయం మేరకు ఈనెల 10వ తేదీన జరగాల్సిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. సీఎస్ ఇతర ఉన్నతాధికారులతో సుదీర్ఘ చర్చలు జరిపిన తరువాత ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీ మేరకు వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి సమర్పించాలని పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ శివశంకర్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. వచ్చే దసరా పండుగ నుంచే పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎస్ ఉన్నతాధికారుల అధ్యక్షతన రాష్ట్ర జేఏసీతో జరిపిన చర్చల ఫలితంగా ఈ నెల 18వ తేదీన మలిదశ చర్చలు జరపాలని నిర్ణయించడం శుభపరిణామమన్నారు. ప్రాథమిక సభ్యుడి ఆలోచనలకు అనుగుణంగా స్నేహపూర్వక వాతావరణంలోనే సమస్యలు పరిష్కారమవుతాయని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏలు బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కనీసం మూడు డీఏలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం నెలకు రూ. 2 వేల కోట్లు కేటాయించాలని ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రూ.11 వేల కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీని నియమిస్తామని ప్రభుత్వం వెల్లడించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ కమిటీ ద్వారా ఉద్యోగులకు తగిన న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ పై కూడా స్పష్టమైన నిర్ణయం వచ్చేలా చర్యలు ఉండాలని రాష్ట్ర జేఏసీకి సూచించారు. జేఏసీ నాయకత్వం ఎక్కడా వెనక్కి తగ్గకుండా ఉద్యోగుల ఐక్య బలాన్ని ప్రభుత్వానికి చూపించి చర్చలు టేబుల్‌పైకి తెచ్చేలా చేయడంలో విజయం సాధించిందన్నారు. 18వ తేదీన జరిగే చర్చల్లో ఉద్యోగులకు స్పష్టమైన లబ్ధి జరగకపోతే వెనువెంటనే ఉత్తర్వులు (జీవోలు) రాకపోతే 19న జరిగే జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో ప్రతి ప్రాథమిక సభ్యుడిని సంపూర్ణంగా ఒప్పించి ప్రత్యక్ష పోరాటానికి నాయకత్వం సిద్ధపడాలని సామాన్య ఉద్యోగి నమ్మకాన్ని గెలుచుకోవాలని రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వీరబాబు, జిల్లా కార్యదర్శి కంచర్ల తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశానికి గడువు పెంపు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సంవత్సరము ప్రవేశానికి ఈనెల సెప్టెంబర్ 30 వరకు గడువు పెంచినట్లు శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల( అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరము ఓపెన్ ఇంటర్ డిప్లమా ఐటిఐ పూర్తి చేసిన వారు మొదటి సంవత్సరానికి అడ్మిషన్ పొందవచ్చు అని పేర్కొన్నారు. కొయ్య చెంచు దివ్యాంగులకు ఎటువంటి ఫీజు ఉండదని చెప్పారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరము తృతీయ సంవత్సరము చదువుతున్న విద్యార్థులు యూనివర్సిటీ ఫీజులు ఈ నెల 30 వరకు చెల్లించాలని వివరించారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**జూలూరుపాడు, మహా:** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు లాకావత్ గిరిబాబు అన్నారు. గురువారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండలంలోని పాపకొల్లు గ్రామంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవం, మహిళా చైతన్యం, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. రజాకారులు, భూస్వాముల దోపిడీకి ఎదురొడ్డి పేదలు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం కోసం ఐలమ్మ చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మూడు చిట్టిబాబు, చాపలమడుగు రామ్మూర్తి, తాళ్లూరి రామారావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఇల్లంగి తిరుపతి, నిమ్మటూరి కనకయ్య, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భూ రీ సర్వే పనులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. చండ్రుగొండ మండలం సీతాయిగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి ఖచ్చితత్వంతో చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పరిధిలో మొత్తం 1,823 ఎకరాలకు భూ రీసర్వే నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు భూముల వివరాల పరిశీలన కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇటీవల గ్రామ సభను కూడా నిర్వహించామని అన్ని శాఖల సమన్వయంతో రీసర్వే ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో సుమారు 200 వరకు నివాసాలు ఉన్నట్లు అధికారులు వివరించగా భూమి ఉన్నప్పటికీ పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూమి వివరాలు సరిపోని వారు రికార్డుల్లో భూముల వివరాలు నమోదు కాని సందర్భాలు కూడా ఉన్నట్లు తెలిపారు. భూ రీసర్వే పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితిని గుర్తించి రికార్డుల్లో అవసరమైన సవరణలు చేయడంతో పాటు అర్హులైన భూహక్కుదారులకు పాస్‌బుక్‌లు పొందే అవకాశం కలుగుతుందని అధికారులు వివరించారు.

# సత్తుపల్లిలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



**సత్తుపల్లి, సెప్టెంబరు 10:** సింగరేణి సత్తుపల్లి ఏరియాలో కార్మికులు, అధికారులు, వారి కుటుంబాల వైద్య అవసరాలకు అనుగుణంగా ఏరియా ప్రధాన ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేtశ్వరరావు కోరారు. కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్‌ను కలిసి సత్తుపల్లి వైద్య సమస్యలను వివరించారు. సింగరేణి మొత్తం బొగ్గు ఉత్పత్తిలో సత్తుపల్లి ఏరియా నుంచి సుమారు 20 శాతం ఉత్పత్తి అవుతున్నప్పటికీ వైద్య సదుపాయాలు మాత్రం తగిన స్థాయిలో లేవన్నారు. ప్రస్తుతం డిస్పెన్సరీలో రెండు పడకలు మాత్రమే ఉన్నాయని, అదనపు పడకలు, వైద్య సిబ్బంది, పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందేలా సమగ్ర వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కోరిన మేరకు 15 రోజుల్లో మహిళా వైద్యురాలిని నియమించినందుకు సీఎంవో కిరణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కిరణ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు మురళీకృష్ణ, షణ్ముఖచారి, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో ఘనంగా ఎడ్ల పండగ



**ఆదిలాబాద్ మహా :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలాల పండుగను రైతులు ఘనంగా ఆనందోత్సహాలతో జరుపుకున్నారు. తెలంగాణ సాంప్రదాయంలో చెట్టూ పుట్ట తో పాటు పశుపక్ష్యాదులను కూడ పూజించడం ఆనవాయితీ . తమకు నిత్యం వ్యవసాయంలో సాయంగా ఉండే ఎద్దులను పొలాల అమావాస్య రోజు భక్తి శ్రద్ధలతో పూజించడమే పండగ సాంప్రదాయం. రైతులు పండగకు ఒక రోజు ముందే చెరువులు కాలువలు  తమ బసవన్నలను తీసుకు వెళ్ళి శుభ్రంగా స్నానం చేయిస్తారు. పండగ రోజు ఉదయం ఎద్దులకు రంగు రంగుల బొట్లు పెట్టి కొమ్ములకు కుషాటలు ,రంగురంగుల బెలూన్లు కట్టి మెడలో గంటల దండలు వేసి అందంగా ముస్తాబు చేస్తారు. అనంతరం సాయంత్రం వేళల్లో తమ తమ గ్రామాలలో డప్పు వాయిద్యాలు, శివనామ స్మరణలతో ఎడ్ల ఊరేగింపు చేపడతారు. ఈ ఊరేగింపులో రైతులతో పాటు మహిళలు పిల్లలు పెద్దలు ఉత్సాహంగా పాల్గొంటారు. ఆయా గ్రామాలలోని హన్మాన్ మందిరాలతో పాటు గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. అనంతరం తమ ఇళ్లకు తీసుకువచ్చి కాళ్లు కడిగి పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. ఇలా రైతుకు ఎద్దుకు మధ్య ఉన్న విడదీయరాని అనుబంధాన్ని గుర్తు చేయడం కూడా పండగ ప్రత్యేకత.

**మెట్టినింట్లో పండగ సందడి**

మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తన మెట్టినిల్లు బేల మండలం సిర్సన్న గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలకు ఆమె పొలాల పండగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలందరు సుఖ శాంతులతో పాడి పంటలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

**వేడుకలు తిలకించిన ఎస్పీ**

జైనథ్ మండల కేంద్రంలో జరిగిన పొలాల పండగ వేడుకలకు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరయ్యారు. రైతులకు పొలాల అమావాస్య శుభాకాంక్షలు తెలిపారు. రైతులు తమ కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ పండుగ మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఎస్పీ అన్నారు. జైనథ్‌లోని లక్ష్మీ సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం రైతులు తమ ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి నిర్వహించిన వేడుకలను వీక్షించారు. రైతులు కలిసికట్టుగా ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఎడ్లను అత్యంత ఆకర్షణీయంగా అలంకరించిన రైతులకు గ్రామపంచాయతీ తరఫున ప్రకటించిన బహుమతులను జిల్లా ఎస్పీ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ ఎస్ఐ పి. గౌతమ్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ఫోన్ల రికవరీకి ప్రత్యేక బృందం

**18 లక్షల విలువచేసే 102 మొబైల్ ఫోన్ల రికవరీ**
**హెడ్ క్వార్టర్స్ లో తిరిగి అందచేసిన ఎస్పీ**




**ఆదిలాబాద్ మహా:** ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్నలేదా చోరీకి గురయిన వెంటనే సీఈఐఆర్ అనే వెబ్సైట్ లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టడం కోసం ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేసామన్నారు. గురువారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఈ నెలలో రికవరీ చేసిన దాదాపు 18లక్షల విలువ చేసే 102 మొబైల్ ఫోన్ లను తిరిగి వాటి యజమానులకు అందించారు. గత 18 నెలల్లో దాదాపు 1700 మొబైల్ ఫోన్స్ లను అందజేసినట్లు తెలిపారు.ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెల రోజుల లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి అందజేస్తామని హామీ ఇచ్చారు. అటు తమ మొబైల్ ఫోన్లను తిరిగి అందుకున్నవారు సంతోషం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, 2 టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, ప్రత్యేక బృందం సభ్యులు ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, మజీద్, అన్వేష్, నవనీత్, జుబేర్, ఇజాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియాలో పర్యావరణ పనుల పరిశీలన



మణుగూరు, మహా: సింగరేణి పర్యావరణ, అటవీ వ్యవహారాల సలహాదారు ఎంఎన్ పర్దాయిన్, ఐఎఫ్ఎస్ (రిటైర్డ్) గురువారం మణుగూరు ఏరియాలో పర్యటించి పర్యావరణ పరిరక్షణ పనులను పరిశీలించారు. ఏరియా నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం వివరాలను తెలుసుకున్నారు. స్థానిక వాతావరణం, నేల పరిస్థితులకు అనువైన జాతుల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మణుగూరు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులో మైనింగ్ అనంతరం ప్రాంతాల పునరుద్ధరణ పనులను పరిశీలించి అధికారులను అభినందించారు. ఎంఎన్‌జీఓసీపీలో మియావాకి విధానంలో అభివృద్ధి చేసిన అటవీ ప్రాంతం, గోదావరి వరద రక్షణ కట్టపై మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. మొక్కల సంరక్షణకు నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు. కార్యక్రమంలో జీఎం దుర్గం రామచందర్, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ..



**మణుగూరు, మహా :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫాంలను మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని మద్దులగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న సుమారు 40 మంది విద్యార్థులకు గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ చేతుల మీదుగా యూనిఫాంలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలతో పాటు బ్యాగులు, షూస్, పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని ఈ సందర్భంగా వారు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కోలపిన్ని మానస, ఉకే కృష్ణవేణి, మంగతాయారు, బిరుదు రాజుల శ్రీదేవి, ఎస్‌కే రహీం పాషా, మాదాడి రాజేష్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవలు మరింత చేరువ

- రోజుకు దాదాపు 400 మందికి సేవలు
- ఆన్‌లైన్‌లో ముందస్తు టోకెన్ బుకింగ్ సదుపాయం
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు ఆధార్ సేవలు మరింత చేరువ చేయడం జరిగిందని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. పట్టణంలోని పాత కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైన గుర్తింపు పత్రంగా మారిందని అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రభుత్వ సేవలు బ్యాంకింగ్ తదితర అవసరాలకు ఆధార్ అవసరమవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఆధార్ సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కొత్తగూడెంలో నూతన ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం ద్వారా జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఆధార్ సేవల కోసం జిల్లా ప్రజలు హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొత్తగూడెంలోనే సేవలు పొందే అవకాశం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో ఆధార్‌కు సంబంధించిన వివిధ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల ప్రజలకు ప్రయాణ సమయం ఖర్చులు పెరిగేవని ప్రస్తుతం స్థానికంగానే ఆధార్ సేవలు అందుబాటులోకి రావడంతో ఆ ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలను క్రమబద్ధంగా పారదర్శకంగా వేగవంతంగా అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముందస్తు టోకెన్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని సూచించారు. వృద్ధులు దివ్యాంగులు మహిళలు చిన్నారులతో వచ్చే తల్లిదండ్రులు తదితరులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఆధార్ సేవల కోసం వచ్చే ప్రజలకు అవసరమైన పత్రాలు సేవల విధానం తదితర అంశాలపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా అధికారిక ఆధార్ సేవా కేంద్రం ద్వారా సేవలను పొందాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యుఐడిఎఐ హైదరాబాద్ రీజినల్ కార్యాలయం ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ చంద్ర, రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ వంశీ, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు, టీఎస్ టీఎస్ జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చుంచుపల్లిలో విజయ మినీ పాల కేంద్రం

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబరు 10: చుంచుపల్లిలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు లక్ష్మీదేవిపల్లిలోని ప్రస్తుత పాల కేంద్రం స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నందున, కేంద్రాన్ని చుంచుపల్లికి త్వరగా మార్చాలని సూచించారు. గురువారం లక్ష్మీదేవిపల్లిలోని విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. కేంద్రంలో రోజువారీ పాల సేకరణ, శీతలీకరణ ప్రక్రియ, పరికరాల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు కేంద్రానికి అనుసంధానమై ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 500 లీటర్ల వరకు పాలు సేకరిస్తుండగా, సీజన్‌లో 4 వేల లీటర్ల వరకు సేకరణ పెరుగుతుందని వివరించారు. కేంద్రాన్ని మార్చే సమయంలో పాల సేకరణకు అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. చుంచుపల్లిలో రైతులకు సౌకర్యవంతంగా కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేసి, మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పాల కేంద్రం ఏర్పాటును సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.



# చాకలి ఐలమ్మకు ఘన నివాళి..

**మణుగూరు, మహా :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా మణుగూరు మండలంలోని హనుమాన్ జంక్షన్‌లో ఆమె విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థ, అణచివేత, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కురం రవి, నాయకులు పాతూరి వెంకన్న, ఏఎం చారి, భాగం రవి, వాసంశెట్టి వెంకట్రావు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు పోడుతూరి రవి, నానాజీ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకురాలు షబానా తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

**సత్తుపల్లి, సెప్టెంబరు 10:మహా :** రజాకార్లు, భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురొడ్డి రైతాంగ హక్కుల కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాచర్ల భారతి మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన, రజాకార్లు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. రైతులను ఏకతాటిపైకి తీసుకొచ్చి తమ భూముల్లో తాము సాగు చేసుకుని, సేద్య ఫలాలను తామే పొందాలనే హక్కు కోసం ఆమె ఉద్యమించారని పేర్కొన్నారు. భూస్వాముల ఆగడాలను ఎదుర్కొంటూ రైతాంగాన్ని సమీకరించిన ఐలమ్మ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచారని భారతి కొనియాడారు. ఆమె వంటి వీరవనితల త్యాగాలు, పోరాటాలను నేటి తరం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం ఉద్యమాలు నిర్మిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, నాయకులు రావుల రాజబాబు, వెంకటేశ్వరరావు, మీరాజ్, రామకృష్ణ, జిలాని, మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు శీలం కరుణ, డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, నాయకులు నాగమణి, రాణి రుద్రమదేవి, భూలక్ష్మి, తిరుమల, సరోజిని, హేమలత, భాస్కర్, చెరుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి భుక్తి కోసం ధైర్యసాహసాలతో పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. భూమి భుక్తి కోసం ఆమె చూపిన పోరాట పటిమ నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తోందని తెలిపారు. ముఖ్యంగా యువత మహిళలు ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక అభివృద్ధికి సమానత్వం కోసం కృషి చేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ జీవితం స్త్రీ సాధికారతకు, సామాజిక సమానత్వానికి మార్గదర్శకంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పోరాటం నుంచి నేటి తరాలు ధైర్యసాహసాలు మానవ విలువలు సామాజిక బాధ్యత న్యాయం వంటి విలువలను అలవరుచుకోవాలని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, డిఆర్ఓ పద్మావతి, కలెక్టరేట్ ఏవో అనంత రామకృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి ఎ. శ్రీలత, బీసీ సంఘాల నాయకులు నేరెళ్ల రమేష్, అజిత్ కుమార్, రెచర్ల సర్వేశ్వర రావు, కణతాల వసంత రావు, పోగుల లక్ష్మీనారాయణ, చిటికెన ముసలయ్య, ముదిగొండ రాంబాబు, కొదుమూరి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు..

**లోపాలు గుర్తించిన కేంద్రాలకు నోటీసులు..**

**మణుగూరు, మహా :** జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, అశ్వాపురం మండలాల్లోని పలు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ ప్రకారం అవసరమైన అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయా, నిర్దేశిత నిబంధనలు అమలు చేస్తున్నారా అనే అంశాలను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని సరిదిద్దుకొని నిబంధనలకు అనుగుణంగా కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. లోపాలు గుర్తించిన డయాగ్నొస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. తనిఖీలకు సంబంధించిన సమగ్ర నివేదికను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాందాస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

## సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ క్లీన్‌స్వీప్ లక్ష్యం

**సత్తుపల్లి, సెప్టెంబరు 10:** సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో 12 ఏరియాల్లోనూ విజయం సాధించడమే ఐఎన్‌టీయూసీ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ అన్నారు. కొత్తగూడెం రీజియన్‌లోని కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు, ఎల్లందు, సత్తుపల్లి ఏరియాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో కోల్పోయిన ఆరు ఏరియాల్లో ఈసారి పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం యూనియన్ కమిటీలను పునర్నిర్మించి, కార్యకర్తలను క్షేత్రస్థాయిలో సమన్వయం చేయాలని సూచించారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, సింగరేణి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కార్మికుల వయోపరిమితి పెంపు, రూ.కోటి ప్రమాద బీమా, కాంట్రాక్టు కార్మికులకు బోనస్ వంటి అంశాల్లో యూనియన్ కృషి చేసిందని తెలిపారు. భవిష్యత్‌లో మెడికల్ బోర్డు, సొంత ఇళ్ల కల, మారుపేర్ల మార్పు, నూతన గనుల ప్రారంభం వంటి అంశాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**మణుగూరు, మహా:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని గురువారం మణుగూరులో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ టెంపుల్ సమీపంలోని ఐలమ్మ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి నిర్మూలనతో పాటు భూస్వాములు, దొరల పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. నిజాం పాలనలోని అణచివేతను ధైర్యంగా ఎదుర్కొని ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారని కొనియాడారు. ఆమె జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎడారి రమేష్, సొందే కుటుంబరావు, తోట రమేష్, వేర్పుల నరేష్, కొత్తపల్లి సీతారాములు, ఆధర్ల రాములు, బోశెట్టి సంపత్, రంగు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సేవకు చిరునామా డాక్టర్ మద్దెల శివకుమార్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** 36 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ సేవల అనంతరం పదవీ విరమణ పొందిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్‌ను నిమ్మలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామ పెద్దలు, ప్రజలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు పాఠశాల అభివృద్ధికి శివకుమార్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కవిగా, రచయితగా, గాయకుడిగా కళారంగానికి సేవలందించడంతో పాటు సామాజిక సేవలోనూ ముందుండేవారని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు తన సొంత నిధులతో అండగా నిలిచి అనేక మందికి సహాయం చేశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుడిగా విద్యారంగ విలువల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. ఆయన సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ షఫీ అహ్మద్ అధ్యక్షత వహించారు. మేయర్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, విద్యాశాఖాధికారిణి లీల, పీఆర్‌టీయూ నాయకులు, కార్పొరేటర్లు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కారేపల్లి ఆరోగ్య కేంద్రానికి సిరంజీల వితరణ

**రోగుల సేవలో కెమిస్ట్ అసోసియేషన్**

**కారేపల్లి, మహా :** కారేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండల కెమిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సిరంజీ బాక్సులను వితరణ చేశారు. పీహెచ్ సీ లో రోగుల వైద్యానికి అవసరమైన సిరంజీల కొరత ఏర్పడటంతో స్పందించిన మండల కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి రంగనాథ్, ఉపాధ్యక్షులు అనంతారపు వెంకటాచారి,గౌరవ సలహాదారులు సూర్యదేవర వెంకటేశ్వరరావు 15 సిరంజీల బాక్స్ లను మండలవైద్యాధికారి డాక్టర్ బీ.సురేష్‌కు అందజేశారు. ఆరోగ్య కేంద్రానికి సిరంజీల బాక్స్ లు అందజేసిన కెమిస్ట్ అసోసియేషన్ ను వైద్యాధికారి అభినందించారు. రోగుల సేవకు ముందు రావటం హర్షనీయమన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ పోలగాని శ్రీనివాసరావు, వెంకట్, రాము, ఏఎన్ఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి మోడీ తీరని ద్రోహం

**పాలకుల విధానాలతో సంక్షోభంలో వ్యవసాయ రంగం**

**కారేపల్లి, మహా:** పంటలకు గిట్టుబాటు ధర కల్పన, రైతు వ్యతిరేక చట్టాల రద్దు, స్వామినాథన్ కమీషన్ అమలుకు లిఖిత పూర్వక హామీ ఇచ్చిన ప్రధానిమోడీ వాటిని అమలు చేయకాం రైతాంగానికి తీరని ద్రోహం చేస్తున్నారని ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ విమర్శిచారు. అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) 4వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కారేపల్లి మండలం మాధారంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాసభల వాల్ పోస్టర్లనువిడుదల చేసిన అనంతరం ఏఐకేఎంఎస్ కార్యదర్శి వై.ప్రకాశ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రా ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేయబడిందన్నారు. ఎన్నికలకు ముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి వాటినిఊసే ఎత్తటం లేదన్నారు. రైతాంగ సమస్యల సాధనే లక్ష్యంగా భవిష్యత్తు కార్యాచరణకు ఈనెల 28 ఖమ్మంలో జరిగే బహిరంగ సభను 29 30 తేదీలలో జరుగు మహాసభలు వేదిక కాబోతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకులు కోయిల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, గడ్డం వెంకన్న, నరేష్, నరసింహారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మట్టి గణపతులను పూజిద్దాం

**నిర్మల్ మహా :** మట్టి గణపతులు పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మంచి మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, కృత్రిమ రంగుల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని అన్నారు. పండుగలన్ని సాంప్రదాయ పద్ధతుల్లో పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మట్టి గణపతులను పూజిద్దాం..

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**హనుమకొండ, మహా:**
వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహిస్తూ మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించాలని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం కుడా కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి మట్టి గణేశ్ విగ్రహాలను గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పండుగను జరుపుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా సంప్రదాయాన్నికాపాడటంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర జలవనరులను కాలుష్యం నుంచి రక్షించవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమై జలచరాలకు,



పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉందన్నారు. ప్రతి కుటుంబం, కాలనీ, గణేశ్ మండపం మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు.కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల చెరువులు, పర్యావరణం కలుషితం కాకుండా మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని సూచించారు. నీటి ఎద్దడి దృష్ట్యా తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గతంలో చెరువు మట్టితో గణపతులను తయారు చేసి అదే చెరువులో నిమజ్జనం చేసేవారని గుర్తుచేశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించి ఆధ్యాత్మిక దృక్పథంతో పండుగను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా ఔషధాల నిల్వలు చేస్తే కఠిన చర్యలు

**జనగామ,మహా ;** జనగామ జిల్లా ఎర్రగొల్లపహాడ్ గ్రామంలో లైసెన్స్ లేకుండా ఔషధాలను నిల్వ చేసి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వరంగల్ జోన్ సహాయ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జనగామ జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఏలె బాలకృష్ణ, భూపాలపల్లి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి. పావని సహకారంతో ఎర్రగొల్లపహాడ్ గ్రామంలో ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యుడు పన్నీరు రమేష్ (46), తండ్రి నర్సయ్య ప్రాంగణంలో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో చెల్లుబాటయ్యే



డ్రగ్ లైసెన్స్ లేకుండా విక్రయం కోసం నిల్వ చేసినట్లు గుర్తించిన 40 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఔషధాల అంచనా విలువ రూ. 210 540 వీటిలో యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్, రక్తపోటు నియంత్రణ మందులు, అలవాటు కలిగించే ఔషధాలు, యాంటీ అల్సర్ మందులు, దగ్గు సిరప్‌లు, నొప్పి నివారణ మందులు తదితర ఔషధాలు ఉన్నాయి.డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940లోని సెక్షన్ 18(సి) నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించి ఔషధాలను స్వాధీనం చేసుకుని క్రిమినల్ కేసు రిజిస్టర్ చేశారు. ఈ స్వాధీనానికి సంబంధించిన వివరాలను సంబంధిత న్యాయస్థానానికి తెలియజేసి, చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఔషద తనిఖీ అధికారి ఏలే బాలకృష్ణ తెలిపారు.

## నకిలీ బంగారం తాకట్టు పత్రాలతో మోసం

**హనుమకొండ, మహా:** నకిలీ బంగారం తాకట్టు పత్రం సృష్టించి, బంగారం వాస్తవంగా తాకట్టు పెట్టకపోయినా ఉన్నట్లు నమ్మించి గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.59.30 లక్షలు మోసం చేసిన కేసులో ఇద్దరిని హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎలిమి సంతోష్ (37), శ్రీమాన్ కోఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ చైర్మన్ కమ్ సీఈఓ, వడ్డేపల్లి రంజిత్ (39), వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. నిందితులు కలిసి కుట్ర పన్ని రంజిత్‌కు చెందిన సుమారు 640 గ్రాముల బంగారం యూనియన్‌లో తాకట్టు ఉన్నట్లు నకిలీ ప్లెడ్జ్ రసీదు తయారు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఆ పత్రాన్ని నమ్మిన గోల్డ్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు బంగారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించకుండానే రూ.59.30



లక్షలను యూనియన్ ఖాతాకు ఆర్‌టీజీఎస్ ద్వారా బదిలీ చేశారు. అనంతరం నగదును ఇతర అవసరాలకు మళ్లించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల మొబైల్ ఫోన్లు, తాకట్టు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసంలో మరెవరైనా ఉన్నారా, ఇతర సంస్థలను ఇదే విధంగా మోసం చేశారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. తాకట్టు బంగారాన్ని ప్రత్యక్షంగా ధృవీకరించిన తర్వాతే రుణాలు మంజూరు చేయాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

## అన్నం పెట్టిన అన్నదాతలు అగ్నికి ఆహుతి

**హనుమకొండ, మహా:** జీవితాంతం ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టి, ఆహార వృథాను అరికట్టేందుకు కృషి చేసిన కేదారి దంపతుల మృతి ఓరుగల్లును విషాదంలో ముంచింది. హనుమకొండ అదాలత్ జంక్షన్‌లోని లింగాల కేదారి హోటల్‌లో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో హోటల్ యజమాని కేదారి రమేష్, ఆయన భార్య లక్ష్మి మృతి చెందారు. సుమారు 20 ఏళ్ల క్రితం చిన్న హోటల్‌తో ప్రారంభమైన వారి సేవా ప్రయాణం అనేక మందికి స్ఫూర్తిగా నిలిచింది. ప్లేట్‌లో అన్నం మిగిలిస్తే జరిమానా, ఆహారం వృథా చేయకుండా తింటే 10 శాతం డిస్కౌంట్ ఇచ్చే విధానాన్ని అమలు చేసి ఆహార వృథాను అరికట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులు, ఉద్యమకారులు, జేఏసీ నాయకులకు ఉచితంగా భోజనం, మంచినీరు అందించారు. వారి సేవలను గుర్తించిన ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో కేదారి దంపతులతో మాట్లాడి ప్రశంసించారు. వారి



మృతి పట్ల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. ఆహార వృథా నివారణలో కేదారి దంపతుల కృషి ఆదర్శనీయమని కలెక్టర్ డాక్టర్ సత్యశారద పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.



## క్రమశిక్షణతో కూడిన క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**మందమర్రిలో 62వ వార్షిక క్రీడ పోటీలు ప్రారంభం**

**మందమర్రి జిఎం రాధాకృష్ణ వెల్లడి**

**మందమర్రి, మహా :** క్రమశిక్షణతో కూడిన క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయని మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ వెల్లడించారు. గురువారం సింగరేణి పాఠశాల మైదానంలో అంతర్ విభాగీయ 62వ వార్షిక క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిఎం హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా శరీరక దృఢత్వాన్ని పెంచుతూ క్రీడాకారులు ఒత్తిడికి గురికాకుండా చేస్తాయని వివరించారు. గెలుపు ఓటములు క్రీడాకారులకు సహజమని అన్నారు. ఏరియాలోని క్రీడాకారుల సామాగ్రి కొనుగోలు కొరకు నాలుగు పాయింట్ 50 లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో క్రీడాకారులకు నాణ్యమైన పరికరాలు కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ క్రీడలలో క్రీడాకారులు రాణించి కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొని సింగరేణి ఖ్యాతిని చాటాలని స్పష్టం చేశారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం ప్రసాద్, డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్, క్రీడల కార్యదర్శి ఎం కార్తీక్, ఎస్ శివకృష్ణ, కెప్టెన్ సాక శ్రీనివాస్, సింగరేణి గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అవసరం

మంచిర్యాల, మహా: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని బీసీ హక్కుల సాధన సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వనం సత్యనారాయణ అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఐలమ్మ 41వ వర్ధంతిని ఘనంగా నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్యంగా పోరాడి పేద ప్రజల హక్కుల కోసం ఉద్యమించారని కొనియాడారు. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మహిళగా, బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా ఎన్నో అణచివేతలను ఎదుర్కొంటూనే ఆమె చూపిన ధైర్యం ఆదర్శనీయమని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కులగణన ఆధారంగా బీసీలకు న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక న్యాయం, బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, మద్దెల శంకర్, ఆంటోని దినేష్, వెల్ది ప్రభాకర్, దంతుల కొండయ్య, దొంతల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎల్.ఎస్ పాయింట్లలో నిల్వల పంపిణీ పూర్తి చేయాలి

**మంచిర్యాల, మహా:** జిల్లాలోని అన్ని ఎం.ఎల్.ఎస్ పాయింట్ల వద్ద నిల్వల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎం.ఎల్.ఎస్ పాయింట్ల ఇన్‌చార్జీలు, డీఈఓలు, స్టేజ్-1, స్టేజ్-2 గుత్తేదారులతో సమీక్ష నిర్వహించారు. నిల్వల తరలింపులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైన మేరకు వాహనాలను ముందస్తుగా ఏర్పాటు చేసుకుని అందుబాటులో ఉన్న నిల్వలను సకాలంలో తరలించాలని గుత్తేదారులను ఆదేశించారు. పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఏసీఎస్ఓతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



భావితరాలకు స్ఫూర్తి చాకలి ఐలమ్మ

**వరంగల్, మహా:** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం న్యూ శాయంపేట జంక్షన్‌లోని ఆమె విగ్రహానికి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, గుండు సుధారాణి, అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలమ్మ ఒక వర్గం కోసమే కాకుండా రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె చూపిన ధైర్యం, ఆత్మవిశ్వాసం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మహిళా సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ఐలమ్మ పోరాటం ప్రతీకగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పోరాట యోధుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

**మంచిర్యాల, మహా:** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నిర్వహించనున్న 'సేవా హి సంఘటన్' కార్యక్రమాలను బూత్ స్థాయిలో విజయవంతం చేయాలని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఇళ్లలో 'ఆశీస్సుల దీపం' కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సన్మానం, రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్, ఆరోగ్య శిబిరాలు, 'నమో సేవా గాథ' వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరారు. మోదీ సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ యాదిలో..

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు.గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆమె విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, జాయింట్ కలెక్టర్ చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాడు భూస్వామ్య వ్యవస్థకు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తన హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్రను ప్రపంచానికి చాటిచెప్పిన ఐలమ్మ ధైర్యసాహసాలు చిరస్మరణీయమని అన్నారు. అణచివేతపై తిరగబడిన ఐలమ్మ అడుగుజాడల్లో నడుస్తూ, సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలను గుర్తించి, ఆమె స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా అనేక కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆమె వర్ధంతి వేడుకలను అధికారికంగా, అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు.మున్సి



పల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ.. వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు.తెలంగాణ తొలి భూ పోరాటాల్లో ధైర్యంగా నిలబడి, పేదలు అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధురాలు అని కొనియాడారు. తన భూమి కోసం మాత్రమే కాకుండా, అన్యాయం దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన ధైర్యం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళలను చైతన్యపరిచి, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, బీసీ ,రజక సంఘ నేతలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నభా నటేష్ గ్లామర్ లుక్‌తో సందడి



టాలీవుడ్ హీరోయిన్ నభా నటేష్ మరోసారి తన అందం, స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. గాఢమైన ఊదా రంగు ప్రింటెడ్ చీరలో ఆమె చేసిన ఫొటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. చీరపై ఎరుపు, బంగారు రంగుల పూల డిజైన్లు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. దీనికి స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను జతచేసిన నభా.. సహజమైన వేవీ హెయిర్‌స్టైల్‌తో సింపుల్‌గానే కనిపిస్తూ తన గ్లామర్‌ను మరింత పెంచింది. మినిమలిస్ట్ స్టైలింగ్‌తో సంప్రదాయ అందానికి మోడ్రన్ టచ్ ఇచ్చిన ఈ లుక్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. 'ఇస్మార్ట్ శంకర్'లో చాందినీ పాత్రతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నభా నటేష్.. తన ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్, సహజమైన నటనతో ప్రత్యేకమైన అభిమానులను సంపాదించుకుంది. ఆ సినిమాలో తన గ్లామర్‌తో పాటు డైలాగ్ డెలివరీ, డ్యాన్స్, నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత తీవ్ర గాయంతో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఆమె.. 'డార్లింగ్' చిత్రంతో మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రియదర్శితో కలిసి నటించిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో తనదైన నటనతో ఆకట్టుకుంది. ప్రస్తుతం నభా నటేష్ విభిన్న కథలు, భారీ ప్రాజెక్టులతో కెరీర్‌లో ముందుకు సాగుతోంది. పాన్ ఇండియా అడ్వెంచర్ డ్రామా 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'తో పాటు 'స్వయంభూ', 'టైసన్ నాయుడు' వంటి ఆసక్తికరమైన చిత్రాల్లో నటిస్తోంది. ఒకవైపు ఫ్యాషన్ ఫొటోషూట్లలో గ్లామర్‌తో మెప్పిస్తూ.. మరోవైపు విభిన్న పాత్రలతో వెండితెరపై తన ప్రత్యేకతను చాటుకుంటున్న నభా నటేష్ దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు కొనసాగిస్తోంది.




# సూర్య కొత్త సినిమాకు టైటిల్

తమిళ స్టార్ హీరో సూర్య వరుస చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఆయన కథానాయకుడిగా మలయాళ దర్శకుడు జితు మాధవన్ తెరకెక్కిస్తున్న కొత్త సినిమాకు టైటిల్, విడుదల తేదీ ఖరారయ్యాయి. ఈ చిత్రానికి 'సీన్' (Scene) అనే ఆసక్తికరమైన టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. ఇందులో నజ్రియా కథానాయికగా నటిస్తుండగా.. నస్లెన్, ఆనంద్‌రాజ్, లాల్, రాజ్ ప్రియన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాను దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. నవంబర్ 6, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.ఈ సినిమాను సూర్య, జ్యోతిక తమ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 'రోమాంచం', 'ఆవేశం' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న జితు మాధవన్.. తొలిసారి సూర్యతో కలిసి తమిళ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సూర్యను ఈ సినిమాలో గత చిత్రాలకు భిన్నమైన పాత్రలో చూపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆయన పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా కనిపించనున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. 'సింగం' సిరీస్ తర్వాత సూర్య మరోసారి పోలీస్ పాత్రలో కనిపించనుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. సూర్య, జితు మాధవన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# విడుదలకు ముందే దూసుకెళ్తున్న ది ప్యారడైజ్

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న 'ది ప్యారడైజ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' విజయవంతం కావడంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి పెరిగింది. తాజాగా విడుదలకు ముందే 'ది ప్యారడైజ్' ఓవర్సీస్ మార్కెట్‌లో మంచి జోరు చూపిస్తున్నట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**నార్త్ అమెరికాలో జోరుగా ప్రీ-సేల్స్**

ముఖ్యంగా నార్త్ అమెరికాలో సినిమా ప్రీమియర్ షోలకు సంబంధించిన టికెట్ బుకింగ్స్ వేగంగా సాగుతున్నాయి. ప్రీసేల్స్ ఇప్పటికే 1.5 లక్షల డాలర్లకు చేరువైనట్లు సమాచారం. ఇప్పటివరకు 5 వేలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు తెలుస్తోంది. విడుదలకు ఇంకా రెండు వారాల సమయం ఉండగానే ఈ స్థాయిలో స్పందన రావడం ఆసక్తిని పెంచుతోంది. రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఓవర్సీస్‌లో ఈ చిత్రం సెప్టెంబరు 23న ప్రీమియర్ కానుంది.

**భారీ ఓపెనింగ్స్‌పై చిత్రబృందం దృష్టి**


నార్త్ అమెరికాలో వేగంగా ప్రీసేల్స్ నమోదు చేస్తున్న తెలుగు చిత్రాల్లో 'ది ప్యారడైజ్' ఒకటిగా నిలుస్తోందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ప్రీసేల్స్ మరింత పెంచుకుని యూఎస్ మార్కెట్‌లో భారీ ఓపెనింగ్ సాధించడంపై మేకర్స్ దృష్టి పెట్టారు. కాయదు లోహర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్‌బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు.

**టీజర్, పాటలకు మంచి స్పందన**

ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. యాక్షన్, ఎమోషన్, భారీ విజువల్స్‌తో సినిమా రూపొందుతున్నట్లు ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఓవర్సీస్ బుకింగ్స్ ఇదే వేగంతో కొనసాగితే సినిమా విడుదల సమయానికి ప్రీసేల్స్ మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# సముద్ర తీరంలో ప్రగ్యా జైస్వాల్ గ్లామర్



హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ తన తాజా ఫొటోషూట్‌తో మరోసారి సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సముద్ర తీరంలోని అందమైన ప్రకృతి మధ్య జరిగిన ఈ ఫొటోషూట్‌లో ప్రగ్యా హైఫ్యాషన్ లుక్‌తో మెస్మరైజ్ చేసింది. చుట్టూ కనిపించే గాఢమైన నీలిరంగు సముద్రం, రాళ్లతో కూడిన తీరం, ప్రశాంతమైన వాతావరణం ఫొటోలకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. సముద్రపు అందాలను ఆస్వాదిస్తూ ప్రగ్యా ఇచ్చిన పోజులు ఎంతో సహజంగా, స్టైలిష్‌గా కనిపిస్తున్నాయి.

పూల డిజైన్లతో కూడిన హాల్టర్ స్టైల్ దుస్తుల్లో ప్రగ్యా తన గ్లామర్‌ను ప్రదర్శించింది. బ్రీజీ ఫ్యాబ్రిక్‌తో రూపొందిన రిసార్ట్ వేర్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టింటెడ్ ఫ్రేమ్ గ్లాసెస్, స్టేట్‌మెంట్ యాక్సెసరీస్, మినిమల్ మేకప్‌తో లుక్‌ను పూర్తి చేసింది. పెద్దగా హంగామా లేకుండా సింపుల్‌గా కనిపిస్తూనే ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చేలా ఆమె స్టైలింగ్ ఉంది. సముద్రం, సూర్యకాంతి, ట్రెండీ అవుట్‌ఫిట్ కలయికతో ఈ ఫొటోషూట్ పూర్తిగా వెకేషన్ వైబ్స్‌ను అందిస్తోంది. ప్రగ్యా పోజులు, ఆమె కాన్ఫిడెన్స్, స్టైలింగ్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**వరుస చిత్రాలతో బిజీగా ప్రగ్యా**

సినిమాల విషయానికి వస్తే ప్రగ్యా జైస్వాల్ విభిన్నమైన పాత్రలు, భారీ ప్రాజెక్టులతో తన కెరీర్‌ను కొనసాగిస్తోంది. తెలుగు చిత్రాలతో పాటు హిందీ సినిమాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ తన నటనా పరిధిని విస్తరిస్తోంది. యాక్షన్, కామెడీ, డ్రామా వంటి విభిన్న జానర్లలో నటిస్తూ తనలోని నటిని ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది.2025లో విడుదలైన 'డాకు మహారాజ్' చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రలో కనిపించింది.

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామాలో ఆమె పాత్రకు ప్రాధాన్యం ఉంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, కమర్షియల్ అంశాలతో రూపొందిన ఈ చిత్రంలో బాలకృష్ణతో కలిసి ప్రగ్యా నటించింది.

అంతకుముందు 2024లో బాలీవుడ్‌లో వచ్చిన 'ఖేల్ ఖేల్ మే' చిత్రంలోనూ ప్రగ్యా తనదైన ముద్ర వేసింది. అక్షయ్ కుమార్, ఆదిత్య సీల్ తదితరులతో కలిసి నటించిన ఈ మల్టీస్టారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో నైనా తన్వర్ పాత్రలో కనిపించింది. భిన్నమైన నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమాలో కామెడీ, ఎమోషన్ అంశాలతో కూడిన సన్నివేశాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది.

ఒకవైపు సినిమాల్లో విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన నటనా ప్రతిభను చాటుకుంటున్న ప్రగ్యా.. మరోవైపు ఫ్యాషన్ ఫొటోషూట్లతో సోషల్ మీడియాలో ప్రత్యేకమైన ఫాలోయింగ్‌ను కొనసాగిస్తోంది.

# సైకో పోలీస్‌గా సునీల్.. ఓటీటీలో ట్రెండింగ్

ఒకప్పుడు స్టార్ కమెడియన్‌గా తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన సునీల్.. ఇప్పుడు ప్రతినాయక పాత్రలతో తనలోని మరో కోణాన్ని చూపిస్తున్నాడు. తెలుగు సినిమాలతో పాటు తమిళం, మలయాళం, కన్నడ చిత్రాల్లోనూ విలన్ పాత్రలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. తాజాగా సైకో పోలీస్ ఆఫీసర్‌గా సునీల్ నటించిన మలయాళ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'అనంతన్ కాడు' ఓటీటీలోకి వచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

**ఆర్య ప్రధాన పాత్రలో క్రైమ్ థ్రిల్లర్**

కోలీవుడ్ స్టార్ హీరో ఆర్య ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి జీఎన్ కృష్ణకుమార్ దర్శకత్వం వహించారు. తమిళ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ సినిమాకు నటుడు, రచయిత మురళీ గోపి కథ అందించారు. గోకులం గోపాలన్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 25న థియేటర్లలో విడుదలైంది. థియేటర్లలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ.. యాక్షన్, క్రైమ్, పొలిటికల్ థ్రిల్లర్ అంశాలతో సినిమా ఆకట్టుకుంది.

**1990ల రాజకీయ నేపథ్యం**

'అనంతన్ కాడు' కథ 1990ల కాలం నాటి తిరువనంతపురం నేపథ్యంలో సాగుతుంది. ఆ సమయంలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, రౌడీయిజం, పవర్ బ్రోకర్ల ప్రభావాన్ని కథలో చూపించారు. స్థానిక వీధి రౌడీలు తమ ఉమ్మడి శత్రువును ఎదుర్కొనేందుకు శ్రీలంక తమిళ తిరుగుబాటుదారుడితో చేతులు కలపడం, ఆ తర్వాత చోటుచేసుకునే పరిణామాల చుట్టూ కథ ముందుకు సాగుతుంది. సాధారణంగా గొడవలకు దూరంగా ఉండాలని భావించే ఓ యువకుడు అనుకోకుండా రాజకీయ, క్రైమ్ ప్రపంచంలోకి లాగబడతాడు. ఆ తర్వాత అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందనేదే సినిమా ప్రధాన కథాంశం.




**సైకో పోలీస్‌గా సునీల్ విలనిజం**

ఈ సినిమాలో సునీల్ పోషించిన సైకో పోలీస్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నెగెటివ్ షేడ్స్‌తో కూడిన ఈ పాత్రలో సునీల్ తన గత విలన్ పాత్రలకు భిన్నంగా కనిపించాడు. క్రూరమైన స్వభావం, భయపెట్టే బాడీ లాంగ్వేజ్, డిఫరెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో పాత్రకు మరింత బలాన్ని తీసుకొచ్చాడు. ముఖ్యంగా తన పాత్రలోని క్రూరత్వాన్ని చూపించే సన్నివేశాల్లో సునీల్ నటన ప్రేక్షకులపై బలమైన ప్రభావాన్ని చూపించింది. కామెడీ నటుడిగా పేరు తెచ్చుకున్న సునీల్ ఇంత భిన్నమైన ప్రతినాయక పాత్రలో కనిపించడం సినిమాకు ప్రత్యేకతగా మారింది.

**ఆర్యకు భిన్నమైన పాత్ర**

ఆర్య ఈ చిత్రంలో వెట్రివేల్ కుమారన్‌గా కనిపించాడు. శ్రీలంక తమిళుడి పాత్రలో నటించిన ఆయన.. తన సాధారణ యాక్షన్ హీరో ఇమేజ్‌కు భిన్నంగా కనిపించాడు. రాజకీయ, క్రైమ్ ముఠాల మధ్య చిక్కుకున్న ఓ వ్యక్తి జీవితంలో చోటుచేసుకునే పరిణామాలను ఆర్య పాత్ర ద్వారా దర్శకుడు చూపించారు. మురళీ గోపి, రెజినా కసాండ్రా, నిఖిలా విమల్, దేవ్ మోహన్, ఇంద్రన్స్, విజయ రాఘవన్, అప్పాని శరత్, శాంతి బాలచంద్రన్, అచ్యుత్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

**5 ఓటీటీల్లో స్ట్రీమింగ్**

థియేటర్ల తర్వాత 'అనంతన్ కాడు' ఒకేసారి ఐదు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో అందుబాటులోకి వచ్చింది. సెప్టెంబర్ 2 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో, లయన్స్‌గేట్ ప్లే, మనోరమ మ్యాక్స్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో స్ట్రీమింగ్ ప్రారంభమైంది. విదేశీ ప్రేక్షకుల కోసం సింప్లీ సౌత్, ఏపీ ఇంటర్నేషనల్ సౌత్ సినిమా వంటి ప్లాట్‌ఫామ్స్‌లోనూ ఈ చిత్రం అందుబాటులో ఉంది. తెలుగు ప్రేక్షకులకు లయన్స్‌గేట్ ప్లేలో తెలుగు ఆడియోతో సినిమా చూసే అవకాశం ఉంది. ఇతర ప్లాట్‌ఫామ్స్‌లో ప్రధానంగా తమిళం, మలయాళం వెర్షన్లు అందుబాటులో ఉన్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com